
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 7 అక్టోబరు 2025 | 5





కష్టాల క్యూ : ఇరుకు సందులో అర్జీదారులు

పెద్దేవంలో ఆగని గేదెల మృత్యుఘోష

మరో ఇద్దరు రైతుల గేదెలకు వ్యాధి

తాళ్లపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దేవం గ్రామంలో గేదెల మృత్యుఘోష ఆగలేదు. ఇంకనూ వరుస మరణాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. నేటికీ గ్రామంలో 40 గేదెల వరకూ మృత్యువాతపడ్డాయి. సోమవారం కొత్తగా ఇద్దరు రైతుల గేదెలకు వ్యాధి సోకిందని సమాచారం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పశు సంవర్థక అధికారి శ్రీనివాస్ తమ సిబ్బందితో సోమవారం గ్రామానికి విచ్చేశారు. అప్పటికే ఒక రైతు వ్యాధి సోకిన రెండు గేదెలను కబేళాకు పంపించేశారు. గేదె మరణిస్తే ఖననానికి సుమారు రూ.10 వేలు ఖర్చవుతుందని.. అదే కబేళాకి తరలిస్తే కనీసం రూ.30 వేలు వస్తున్నాయని పాడి రైతులు అంటున్నారు. జిల్లా పశుసంవర్థక అధికారి ఎ.శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో రైతులు సహకరించడంలేదని.. వ్యాధి బారిన పడిన గేదెలను ఆసుపత్రికి తరలిస్తేనే పూర్తి వైద్యం అందించ గలమని అధికారులు అంటున్నారు. కానీ రైతులు మాత్రం గేదెలను ఇవ్వమని తేల్చి చెబుతున్నారన్నారు.



వ్యాధి బారిన పడిన గేదెను పరిశీలిస్తున్న పశు సంవర్థక శాఖాధికారి శ్రీనివాస్ తదితరులు



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి చిత్రంలో జేసీ మేఘ స్వరూప్ తదితరులు

కలెక్టరేట్‌కు స్థానిక సమస్యలు వద్దు

పీజీఆర్ఎస్‌లో అధికారులను ఆదేశించిన కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం రూరల్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల, డివిజన్ స్థాయిలోనే స్థానిక సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. తహశీల్దార్, ఎంపీడీవోలు వ్యక్తిగత బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఇకపై అంశాల వారీగా అర్జీలపై మండలాల వారీగా విశ్లేషణ చేయడం జరుగుతుందని తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘస్వరూప్ డీఆర్‌వో సీతారామమూర్తి ప్రజల నుంచి 149 అర్జీలు స్వీకరించారు. సమస్యలు జిల్లాస్థా యి పీజీ ఆర్ఎస్‌కు రాకుండా స్థానికంగానే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సర్వే, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి అర్జీలు అధికంగా వస్తున్నాయన్నారు. ఆయా శాఖల అధికారులు పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు.గ్రామాల్లో రీ సర్వే చేస్తుంటే సంబంధిత భూయ జమానులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలన్నారు.మ్యుటేషన్ల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిం చాలని ఆదేశించారు. భూముల మ్యుటేషన్ తిరస్కరణకు కారణాలను స్పష్టంగా వివరించే స్పీకింగ్ ఆర్డర్ తప్పనిసరిగా ఇవ్వాలని తహశీల్దార్లకు సూచించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 25 అర్జీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. 25 అర్జీలను స్వీకరించినట్టు తెలిపారు.



ప్రయాణ బాదుడే!

ప్రైవేట్ ట్రావెల్స్ మహా దోపిడీ

టిక్కెట్ కొనలేక ఇక్కట్లు..

ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ మితిమీరిపోయింది. ప్రైవేటు బస్సు ఆపరేటర్లు బస్సు రకాన్ని బట్టి వసూలు చేస్తున్నారు.మల్టీ యాక్సిల్, భారత్ బెంజ్, వోల్వో, స్కానియా ఇలా తయారీదారులు, సాంకేతికత పేరు చెప్పి మరీ బాదేస్తున్నారు. అయినా పట్టించుకున్నవాళ్లే లేరు. బెంగళూరుకు సాధారణంగా మామూలు రోజుల్లో టిక్కెట్ రూ.2 వేల లోపే ఉంటుంది. ప్రస్తుతం రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకూ లాగేస్తు న్నారు.హైదరాబాద్‌కు సాధారణ రోజుల్లో రూ.1200 నుంచి రూ.1500 ఉంటుంది. ప్రస్తుతం గరిష్ఠంగా రూ.4,700ల వరకు వసూలు చేస్తు న్నారు. చెన్నై అయితే రూ.1800 ఉంటుంది. ప్రస్తుతం రూ.4 వేల వరకూ ఉంది. ప్రైవేటు బస్సు టికెట్లకు గొలుసుకట్టులా ఏజెంట్లు ఉండడంతో వాళ్ల కమీషన్‌ని కూడా ప్రయాణికుల నుంచే వసూలు చేస్తుండడంతో టికెట్ ధర అమ్మో అనిపిస్తోంది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల గుండా ప్రయాణించే ప్రైవేటు బస్సులకు సంబంధించి 50కిపైనే ఆప రేటర్లు ఉన్నారు. వీళ్లందరూ పండుగల వేళ ధరలను అమాంతం పెంచేస్తున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

దసరా సెలవులు ముగిశాయి. ఊళ్లకు వచ్చిన జనం ఇంటిబాట పట్టారు. ముందుగా ప్లాన్ చేసుకున్న వాళ్ల సంగతి బాగానే ఉన్నా.. మిగతా ప్రయాణికులకు మాత్రం ప్రయాణ నరకం తప్పడం లేదు.ఒక వైపు రైళ్లలో రిజర్వేషన్లు నిండుకున్నాయి. తత్కాల్‌లోనూ ఖాళీలు లేవు. ఇదే అదనుగా మరో వైపు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ఆపరేటర్లు అమాంతం ధరలు పెంచేశారు. బెంగళూరుకు ఏకంగా రూ.5 వేల వరకూ వసూలు చేస్తున్నారు.ఓ నలుగురు ఉన్న కుటుంబం వెళితే అక్షరాలా రూ.20 వేలు చార్జీలకే అవుతోంది. ప్రైవేటు బస్సుల బాదుడుపై విశాఖపట్నం జిల్లా రోడ్డు రవాణా అధికారులు కన్నెర్ర చేశారు. ఉమ్మడి తూర్పు అధికారులు మాత్రం ఇంకా కన్ను తెరవలేదు. అత్యవసరంగా వెళ్లాలంటే అప్పు తప్పదన్నట్టు పరిస్థితి ఉంది.

గోదావరి జిల్లాల నుంచే రద్దీ..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ఎక్కువగా ప్రయాణాలు సాగిస్తారు. ఉపాధికి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడానికి కోనసీమ జిల్లా నుంచి ఎక్కువగా వెళుతుంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సాఫ్ట్‌వేర్ తదితర ఉద్యోగాల్లో ఉన్న యువత ఎక్కువే. పండుగ వేళల్లో తమ ఊళ్లకు వస్తుంటారు. పండుగ ముగిసిన వెంటనే తిరుగు ప్రయాణం అవుతారు.అధిక శాతం రైలులోనే ప్రయాణిస్తారు. ఎందుకంటే ధర తక్కువ. అయితే రైలులో బెర్తులు నిండుకోవడంతో ప్రత్యామ్నాయం చూస్తున్నారు. దీంతో ప్రైవేటు బస్సుల వైపు చూస్తున్నారు. బస్సుల్లో బాదుడు విపరీతంగా ఉంది. దీంతో ప్రయాణ తిప్పలు తప్పడం లేదు.చెన్నై, బెంగళూరుకు ఆర్టీసీ బస్సులు లేవు. హైదరా బాద్‌కి ఉన్నా ధరలు తక్కువ వల్ల ముందుగానే రిజర్వేషన్లు పూర్తవుతున్నాయి. దీంతో ప్రైవేటు బస్సులపై ఆధారపడక తప్పడం లేదు.

మన అధికారులేం చేస్తున్నారు?

ఒకవైపు ప్రయాణికుల అవసరం, మరోవైపు అధికారులు అమ్యామ్యాల్లో మునిగి తనిఖీలు లేకపోవడం, రైళ్లలో ఖాళీలు లేకపోవడం ప్రైవేటు బస్సు ఆపరేటర్లకు వరంగా మారుతోంది. విశాఖపట్నంలో ఈ నెల 2న దసరా సందర్భంగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో ఆ జిల్లా రోడ్డు రవాణా అధికారులు విస్తృతంగా సోదాలు చేశారు.అధిక చార్జీలు వసూలు చేయడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి వాటిపై దృష్టి సారించారు. ఏకంగా 40 బస్సులపై కేసులు నమోదు చేశారు. కానీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారులు మాత్రం అసలు ఆ దిశగా కన్నెత్తి చూడలేదు.

విమానధరలు ఇలా...

ప్రస్తుతం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతో పోలిస్తే విమానయాన ధరలే కాస్త అందుబాటులో ఉన్నాయి. బెంగళూరుకు వయా హైదరాబాద్ సింగిల్‌స్టాప్ అయితే సాధారణంగా టిక్కెట్ ధర రూ.13 వేలు ఉంది.. ప్రస్తుతం రూ.20 వేలు ఉంది. డైరెక్ట్ అయితే మామూలు రోజుల్లో రూ.5000 ఇప్పుడైతే రూ. 6,000.. ఆదివారం అయితే రూ.7500ల ఉంటుంది. పండుగ సమయాల్లో ఫ్లైట్ ధరలు ఇష్టానుసారం పెంచ కుండా డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) నిఘా పెట్టింది. ప్రయాణికులకు తగినట్టు విమాన సామర్థ్యాలు పెంచాలని సూచించింది.

రైళ్లు ఫుల్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రవాణా పరంగా గేట్‌వే రాజమండ్రి రైల్వే స్టేషను. బెంగళూరుకు ప్రత్యేక, వారాంతపు రైళ్లతో కలిపి రోజుకు 10 వరకూ రైళ్లు వెళుతుంటాయి. అయితే ఏ రైలులో కూడా టికెట్లు లేవు. హౌరా, హతియా, మాల్దా వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లకు వచ్చే నెలలో కూడా అసలు వెయిటింగ్ లిస్ట్‌లోనూ టికెట్లు లేవు. ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా ప్రయాణికులు రాకపోకలు సాగించే శేషాద్రి, ప్రశాంతిలో వెయిటింగ్ లిస్టు చాంతాడంత ఉంది. హైదరాబాద్ విషయానికి వస్తే రోజూ 16కిపైగా రైళ్లు నడుస్తున్నాయి. వీటిలో ఎక్కువగా సుదూర ప్రాంతాల నుంచి నడిచేవి కావడంతో సాధారణ బోగీల్లో కాలు పెట్టడానికి కూడా వీలు ఉండదు. గౌతమి, గోదావరి, విశాఖ, మహబూబ్‌నగర్ రైళ్లకు వెయిటింగ్ లిస్టు 100దాటి పరుగులు పెడుతోంది. చెన్నైకి ప్రతి రోజూ 10 వరకూ రైళ్లు అందుబాటులో ఉండగా కాకినాడ -పుదుచ్చేరి మినహా మిగతా రైళ్లలో ఖాళీలు లేవు.

- ముగిసిన దసరా పండుగ
- ఇంటి బాట పట్టిన బంధుగణం
- ఆర్టీసీ బస్‌లు.. రైళ్లు ఫుల్..
- ప్రైవేట్ ట్రావెల్స్ ప్రత్యామ్నాయం
- రద్దీ కారణంగా టిక్కెట్ అధనం
- ప్రయాణికుల లబోదిబో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం ప్రసాద్

పొగాకు వద్దు..ప్రత్యామ్నాయం చూడండి

పొగాకు బోర్డు ఆర్ఎం ప్రసాద్

దేవరపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని పొగాకు బోర్డు ఆర్ఎం జీఎల్‌కే. ప్రసాద్ పేర్కొన్నారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో దేవరపల్లి, గోపాలపురం పొగాకు రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల దృష్ట్యా పొగాకు పంట నియంత్రించాల్సి వస్తుందన్నారు. పొగాకు బోర్డు పరిమితి మేరకే పండించాలని రైతులు సూచించారు. కొవ్వూరు వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా పలు అపరాల పంటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవోలు కమలరాజు, ఏసు బాబు, రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, కాట్రు వీరవెంకట సత్యనారాయణ, నరహరశెట్టి రాజేంద్రబాబు,పరిమి శ్రీరామకృష్ణ, కాట్రు భీమరాజు,గద్దే శేషగిరిరావు, సత్తి జగదీశ్వర్ రెడ్డి, హేమస్మిత, రమేశ్ పాల్గొన్నారు.

సారా తయారీ అరికట్టాలి

నవోదయం 2.0 జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో సారా తయారీ, విక్రయాలు, రవాణా వంటి వాటిని పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రస్తుత పరిస్థితిని జిల్లా ఎక్సయిజ్ అధికారి సీహెచ్.లావణ్య నివేదించారు. అనంతరం కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ఎక్కడ ఎవరు సారా తయారు చేసినా,అమ్మినా, రవాణా చేసినా 14405కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు.ఈఎస్ లావణ్య మాట్లాడుతూ సారా నిర్మూలనకు జిల్లాలోని 19 మండలాల్లో 19 మండల స్థాయి కమిటీలు, 240 గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేశామన్నారు.ఇప్పటి వరకూ జిల్లాలో 313 అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామని 63 మంది దత్తత అధికారులను నియమించామని తెలిపారు. జిల్లాలో ఆరుగురిపై పీడీ యాక్ట్ పెట్టి ఏడాది పాటు జైలుకు పంపించామన్నారు. జిల్లాలో సారాకు సంబంధించిన 1029 కేసులు నమోదు చేసి 1079 మందిని రిమాండ్‌కు పంపామని తెలిపారు. 13,500 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 3,97,240 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్టు చెప్పారు. 40,324 కేజీల బెల్లం స్వాధీనం చేసుకుని 19 మంది బెల్లం విక్రయదారులపై కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్, అదనపు ఎస్పీ ఏవి సుబ్బరాజు, ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణి సుస్మిత, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్.మూర్తి .డీఎస్‌వో వి.పార్వతి, డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి. శశాంక, ట్రైబల్ ఆఫీసర్ కెఎన్.జ్యోతి ,ఎక్సయిజ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



కోరుకొండ పీహెచ్‌సీ ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న బంధువులు

వైద్యం అందించకుండా చంపేశారు?

కోరుకొండ పీహెచ్‌సీ ఎదుట బంధువుల ఆందోళన

కోరుకొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సకాలంలో వైద్యం చేయకుండా మృతికి కారణమయ్యారంటూ కోరుకొండ పీహెచ్‌సీ ఎదుట పలువురు ఆందోళనకు దిగారు. గత నెల 30వ తేదీ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పాముకాటుకు గురయ్యాడు. ఆసుపత్రికి తీసుకువస్తే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అతనికి పాముకాటు వ్యాక్సిన్ వేయలేదు. దీంతో రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ సోమవారం గాదరాడకు చెందిన కొందరు గ్రామస్తులు కోరుకొండ పీహెచ్‌సీ ముందు ధర్నా చేశారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పీహెచ్‌సీకి వచ్చి వైద్యాధికారులను ప్రశ్నించారు. రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జంబూపట్నం మాజీ సర్పంచ్ నాగా సత్యనారాయణ, ఉల్లి గణ, తోరాట శ్రీను , వైసీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



51 జిల్లా అవార్డులు అందజేసిన కలెక్టర్ కీర్తి చేకూరి చిత్రంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ సోము తదితరులు

స్వచ్ఛ..పండుగ

జిల్లాకు 54 స్వచ్ఛాంధ్ర అవార్డులు



అనపర్తి జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం వెంకటరెడ్డికి అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి, కలెక్టర్

- 3 రాష్ట్ర అవార్డులు అందించిన సీఎం
- 51 జిల్లా అవార్డులిచ్చిన కలెక్టర్
- ప్రతి పల్లె స్వచ్ఛంగా ఉండాలి
- మార్పు మన నుంచే రావాలి
- కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర 2025 అవార్డుల ప్రదానోత్సవం రాజమహేంద్రవరంలో పండుగలా జరిగింది. శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సోమవారం రాత్రి జిల్లా సాసా నోడల్ అధికారి జేసీ వై.మేఘస్వరూప్ సమన్వయకర్తగా స్వచ్ఛాంధ్ర 2025 అవార్డుల ప్రదానోత్సవం చేశారు. తొలుత కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ స్వచ్ఛత అనేది దేశానికో, రాష్ట్రానికో చేసే సేవగా భావించకుండా మనకు మనం చేసుకునే సేవగా ప్రతి ఒక్కరూ భావించాలని అప్పుడే మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. మార్పు అనేది మన ఇంటి నుంచి.. మన పిల్లల నుంచే ఆరంభం కావాలన్నారు. జిల్లాకు స్వచ్ఛత అవార్డులు రావడం వెనుక పారిశుధ్య కార్మికుల కృషి ఎంతో ఉందని అభినందించారు. జిల్లాకు 3 రాష్ట్ర, 51 జిల్లా స్థాయి అవార్డులు రావడం ఆనందకరమన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ 2017లో ప్రారంభమై పెను మార్పులు తెచ్చిందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ అధికారులు, పారిశుధ్య కార్మికుల కృషి ఫలితంగా అవార్డులు వచ్చాయన్నారు. రాష్ట్రాన్ని హరితాంధ్రగా మార్చాలని ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించుకోవాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు ఉన్నారన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం అవార్డుల ప్రదానం చేశారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ ప్రతి పల్లె స్వచ్ఛంగా తయారుచేయాలన్నారు.

3 రాష్ట్రస్థాయి అవార్డులు

స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల కేటగిరీ కింద రెండు రాష్ట్రస్థాయి అవా ర్డులను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వరరావు అందుకున్నారు. స్వచ్ఛ బస్‌స్టేషన్‌గా కొవ్వూరు ఎంపికైంది. అవార్డును నాటి డీఎం వైవీవీఎన్ కుమార్‌కు సీఎం చంద్రబాబు అందజేశారు.

51 జిల్లాస్థాయి అవార్డులు..

స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల అవార్డును ఆర్‌డీవో కృష్ణనాయక్, ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయ అవార్డు శ్రీనివాసరావు అందుకున్నారు.

ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ కె.వీరపాండు(వెం కటనగరం),బొంగరాల దుర్గాప్రసాద్ (వేలివెన్ను),పి.రామారావు(నందమూరు), యు.నాగరాజు(ఘంటావారిగూడెం), బత్తిన రాజు (కుతుకులూరు) అవార్డులు అందుకున్నారు.

ఉత్తమ స్వచ్ఛత ఎన్జీవోలు : గుబ్బల రాంబాబు (స్వర్ణాంధ్ర ఫౌండేషన్,రాజమండ్రి), పీవైఎన్‌వీ.సతీష్ , మల్లిడి శ్రీనివాసరెడ్డి (శ్రీరామకృష్ణ సేవా సమితి, అనపర్తి), బీకె హేమ(ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయవిశ్వవిద్యాలయం , రాజమండ్రి)లకు ప్రదానం చేశారు.

ఉత్తమ స్వచ్ఛత యోధులు : ఇంటి పార్వతి, రేలంగి సత్యనాగేశ్వరావు, ముత్యాల పాండురంగ,యార్లగడ్డ సుబ్బయ్యమ్మ (రాజమండ్రి కార్పొరేషన్), బంగారు సూరిబాబు ,బొట్టు శ్రీహరి, కృష్ణవేణి మామిడిపల్లి, వడ్డాది దుర్గారావు (నిడదవోలు), మీసాల శ్యాంబాబు ,వడ్డాది సత్తిబాబు (కొవ్వూరు)లకు ప్రదానం చేశారు.

స్వచ్ఛ అంగన్‌వాడీలు : సోమన అరుణదేవి (రాజమండ్రి చౌడేశ్వర్‌నగర్),కోరుకొండ అంగన్‌వాడీ అజూబా (కొడమంచిలి),ముక్కామల అంగన్‌వాడీ (పెరవలి) వి.నయనమ్మ, కొవ్వూరు రాజీవ్ కాలనీ అంగన్‌వాడీ చల్లా కనకదుర్గాదేవి, నిడదవోలు తాడిమళ్ళ అంగన్‌వాడీ ఎల్లా మోహినీదేవిలకు అవార్డులను ప్రధానం చేశారు.

స్వచ్ఛ పంచాయతీలు : మహబూబ్ అలీ(చాగల్లు), బానోతు వెంకటేశ్వర్లు(ఘంటావారి గూడెం), డి.ముత్యం(ఐ.పంగిడి), వడ్డి వీరేంద్ర(కాతేరు), ఎస్ఎస్.ఫణికుమార్(కుతుకులూరు) అవార్డులను అందుకున్నారు.

స్వచ్ఛ ఆసుపత్రులు : పీహెచ్‌సీ డాక్టర్ కె చంద్రబాబు(చాగల్లు), డాక్టర్ ఏహరి శ్రీనివాస్ (ఖండవల్లి), డాక్టర్ దిలీప్ కృష్ణ చైతన్య(రాజమండ్రి మెరకవీధి)లకు అవార్డులు ఇచ్చారు.

స్వచ్ఛ హాస్టల్స్ : ఎస్సీ బాలికల వసతి గృహం కె.నాగభూషణం(సమిశ్రగూడెం), గణేష్ చౌక్ బీసీ హాస్టల్ వాసంశెట్టి సత్యవాణి(రాజమండ్రి), జీఎహెచ్‌ఎస్ ఎంఐ ప్రియదర్శిని (బొమ్మూరు) అవార్డులు అందుకున్నారు.

స్వచ్ఛ పరిశ్రమలు : బలభద్రపురం గ్రాసిం ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎం.జగదీష్ గుప్తా, గుమ్మళ్ళదొడ్డి అస్సాగో ఇండస్ట్రీస్ కె.విశ్వనాథ్ నాయుడు, రాజమండ్రి రూరల్ తేజాస్ స్టీల్ ఇండస్ట్రీస్ సేథి రమేష్ కుమార్,ధవళేశ్వరం హౌస్ ఆఫ్ ట్రైబ్ ప్రైవేట్ లిమిటెడ్ కిషోర్‌లకు అవార్డులిచ్చారు.

స్వచ్ఛ పురపాలక సంఘాలు : నిడదవోలు ఏఎం సత్యనారాయణ, స్వచ్ఛ నివాస వసతి గృహాలు అవార్డులను ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ధవళేశ్వరం ఏ.వాణి కుమారి అందుకున్నారు. స్వచ్ఛ రైతు బజార్ అవార్డును రాజమండ్రి క్వారీ రైతు బజార్ ఎస్.రోజియా అందుకున్నారు.

స్వచ్ఛ పాఠశాలలు : రఘుదేవపురం పీఎంశ్రీ జడ్పీ స్కూల్ శ్యామలదేవి, నిడదవోలు జెడ్పి హెచ్‌ఎస్ బాలికల పాఠశాల నిట్టల అరుణరాజేశ్వరి ఫిలిప్, అనపర్తి ఎస్ఆర్ జడ్పీహెచ్‌ఎస్ ప్లస్ పి.వెంకటరెడ్డి, రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీ ఎన్.ప్రశాంతి, కుమారదేవం ఎంపీపీ స్కూల్ పి.చాముండేశ్వరి అందుకున్నారు.

స్వచ్ఛ డ్వాక్రా సంఘాలు : రాజమహేంద్రవరం సీతంపేట మహిళా సహకార సంఘం, కొవ్వూరు రాజీవ్‌కాలనీ మహిళా సంఘం, శ్రీనివాసపురం మహిళా సంఘం అవార్డులను పీడీ టీకనకరాజుకు అందించారు.

స్వచ్ఛ గ్రామాలు : బి.అబ్బులు (చంద్రేడు), బండారు రామకృష్ణ(కానూరు), పెనుమాక రోజ్ మాణిక్యం (కరిచర్లగూడెం), గుమ్మడి సునీత(వెలుగుబంద), కంఠం విజయనిర్మల(వేములూరు) అవార్డులు అందుకున్నారు.



మృతి చెందిన గ్రామ పెద్ద జ్ఞాపకంగా ఏర్పాటు చేసుకున్న బండరాయిపై ధాన్యం, బియ్యం, పప్పులు ఉంచిన పావురులంక ఆదివాసీలు

గ్రామ పెద్ద... వలస ఆదివాసీ గ్రామాల్లో ఆయన మాటే శాసనం. ఆయన నిర్ణయమే శిరోధార్యం. పండుగ జరుపుకోవాలన్నా, వ్యవసాయ పనులు మొదలు పెట్టాలన్నా, పెళ్లిళ్లు నిశ్చయించాలన్నా ఆయనదే నిర్ణయాధికారం. దానిని దాటి ఎవరైనా ఒక్క అడుగు వేసినా అపచారం. అది వారి విశ్వాసం. అటువంటి గ్రామ పెద్ద కాలం చేస్తే ఊరంతా కలిసి ఓ పెద్ద తంతే జరుపుకుంటారు. ఆయన పేరిట ఓ బండరాయిని మూడు దారుల కూడలిలో ఏర్పాటు చేసుకుంటారు. జీవించినంత కాలం గ్రామ పెద్దకు ఇచ్చిన గౌరవాన్నే ఆ రాయికీ ఇస్తారు. దానిపై అల్లుడిని కూర్చోబెట్టి పూజ చేస్తారు. ఆ నిమిషం నుంచి గ్రామ పెద్ద ఆత్మ అతని అల్లుడిలో ప్రవేశిస్తుందని వారి నమ్మకం. ఇదంతా చూడ్డానికి వింతగా ఉన్నా వారి ఐక్యతకు మాత్రం ఓ పెద్ద నిదర్శనం. చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పావురులంకలో ఇటీవల జరిగిన ఈ తంతు విశేషాలు తెలుసుకుందాం...



రాయి కాదు జ్ఞాపకం

- బండరాయికి మరణించిన గ్రామ పెద్దలా గౌరవ, మర్యాదలు
- అల్లుడిలో అతడి ఆత్మ ప్రవేశిస్తుందని వారి విశ్వాసం
- రాయిపై కూర్చోబెట్టి పూజలు
- ఇదీ వలస ఆదివాసీల ఆచారం

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

ఛత్తీ‌స్‌గఢ్ నుంచి పలు కుటుంబాలు కొన్నేళ్ల క్రితం వివిధ కారణలతో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి వలస వచ్చాయి. ఆ కుటుంబాలు అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిలాలతో పాటు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ తదితర జిల్లాల్లో జీవనం సాగిస్తున్నాయి. కొన్ని కుటుంబాలు ఒడిసా, మహారాష్ట్రల్లోని పలు జిల్లాలకు వలస వెళ్లాయి. వారంతా అటవీ ప్రాంతంలో గ్రామాలు ఏర్పాటు చేసుకుని పోడు సాగుతో బతుకు బండి లాగుతున్నారు. ఏ కుటుంబమైతే అందరికంటే ముందుగా వచ్చి అడవిలో నివాసం ఏర్పాటు చేసుకుని గ్రామం నెలకొల్పుతుందో ఇక అప్పటి నుంచి ఆ కుటుంబ పెద్దే గ్రామ పెద్దగా వ్యవహరించడం వారి కట్టుబాట్లలో ప్రధానమైనది. ఆ తర్వాత వలస వచ్చిన కుటుంబాలన్నీ గ్రామ పెద్ద మాటే శిరోధార్యంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో గ్రామ పెద్ద మృతి చెందితే ఊరంతా ఏకమై ఓ పెద్ద తంతే జరుపుకుంటుంటారు. దహన సంస్కారాలు పూర్తయిన నెల రోజలకు ఊరిలోని వారంతా సమీపంలోని అడవిలోకి వెళ్లి కాసింత పలచగా, పలకలగా ఉన్న బండరాయి కోసం అన్వేషిస్తారు. వారు అనుకున్న మాదిరి బండరాయి లభ్యం కాగానే దానిని జడ్డీపై మోసుకుని ఆ ఊరికి చేరుకునే మూడుదారుల కూడలికి తీసుకొస్తారు. (సహజంగా వలస ఆదివాసీ గ్రామం చేరుకోవాలంటే మూడు, అంతకు పైనే కాలిబాటలు ఉంటాయి). అలా చేరుకున్నాక ఆ బండరాయి జడ్డీపై మృతి చెందిన గ్రామ పెద్ద మేనల్లుడినో లేదా కూతురు భర్తనో ఎక్కించుకుని కూడలి చుట్టూ ఐదు పర్యాయాలు ప్రదక్షిణ చేస్తారు. ఆ సమయంలో బండరాయి జడ్డీపై కూర్చున్న అల్లుడు డోలు కొయ్య వాయిస్తాడు. ఐదుసార్లు ప్రదక్షిణ జరిపాక జడ్డీని కిందకు దింపుతారు. అనంతరం మహిళలంతా కలిసి బండరాయిపై కూర్చున్న అల్లుడికి పసుపు పూసి బిందెలతో తలపై నీళ్ల పోస్తారు. ఈ తంతు ముగిసాక మృతి చెందిన గ్రామ పెద్ద కుటుంబీకులు, బంధువర్గం బండరాయిపై కూర్చున్న అల్లుడి కండువా చెంగులో రూపాయి నుంచి ఐదు రూపాయల వరకు పెడతారు. అప్పటినుంచీ కాలం చేసిన గ్రామ పెద్ద ఆత్మ ఆ బండరాయిపై కూర్చున్న అల్లుడిలో ప్రవేశిస్తుందని వారి నమ్మకం.



జడ్డీపై తీసుకొస్తుండగా డోలు వాయిస్తున్న గ్రామ పెద్ద అల్లుడు

ఈ తంతు ముగిసాక బండరాయిని మహిళలు శుభ్రంగా కడిగి పసుపు బొట్లు పెడతారు. ఆ బండరాయిపై ధాన్యం, పప్పులు, చుట్ట... ఇట్లా కొన్ని వస్తువులు ఉంచి మూడుదారుల కూడలిలో ఉంచుతారు. ఆ క్షణం నుంచీ ఆ రాయికి జీవించినంత కాలం గ్రామ పెద్దకు ఇచ్చిన గౌరవ మర్యాదలే ఇస్తారు. ఆ రోజు నుంచి గ్రామానికి చెందిన ఎవరైనా సరే వేరే ఊరు వెళ్లి వస్తున్నా, సంతకు వెళ్లి వస్తున్నా ఆ మూడుదారుల కూడలి వద్ద కొద్ది నిమిషాలు పాటు ఆగి గ్రామ పెద్ద పేరిట నెలకొల్పిన బండరాయిపై ఆయనకు ఇష్టమైన తినుబండారాలు గానీ, చుట్ట-బీడీ గానీ, సారా, కల్లు గానీ ఉంచి దండం పెట్టుకుంటుంటారు. ఈ తంతు కేవలం ఊరి పెద్దకు మాత్రమే జరుపుతారు. అంటే ఈ తరహా గౌరవం గ్రామ పెద్దకు మాత్రమే పరిమితమన్న మాట. ఇతరులెవ్వరూ మృతి చెందినా సాధారణ కార్యక్రమాలే నిర్వహిస్తారు.



మృతి చెందిన గ్రామ పెద్ద జ్ఞాపకంగా మూడు రహదారుల కూడలి వద్ద ఏర్పాటు చేసుకున్న బండరాయిని శుభ్రం చేస్తున్న కుటుంబీకులు

చూడ చక్కని వేడుక...


13 వాహనాల కలయిక

- అంబాజీపేటలో రేపు విజయభేతాళ ఉత్సవం
- అభ్యుదయ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు

అంబాజీపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయభేతాళ ఉత్సవం... అనగానే ముందుగా గుర్తుకొచ్చేది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట. శరన్నవ రాత్రుల్లో భాగంగా ఇక్కడ 58 సంవత్సరాలుగా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. 59వ వార్షికోత్సవాన్ని అభ్యుదయ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. అనుకున్న లక్ష్యం సాధించేందుకు భేతాళుని పూజించడం ఇతర దేశాల నుంచి అనాదిగా వస్తున్న సంప్రదాయం. కలశస్థాపనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం పది రోజులు కొనసాగింది. అమ్మవారితో పాటు భేతాళునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వాహనాలను విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించి దైవ రూపాలను పురవీదుల్లో ఊరేగిస్తూ అంబాజీపేట సెంటరుకు చేరుకుంటారు. చెడీతాలింఖానా, కర్రసాము, అగ్గిబరాటాలతో యువకులు చేసే విన్యాసాలు చూపరులను గగుర్పాటుకు గురిచేస్తాయి.




విజయ భేతాళస్వామి



పోటాపోటీగా వాహనాల ముస్తాబు...

భేతాళస్వామి ఉత్సవంలో 13 వాహనాలు పాల్గొంటాయి. వీటిని వివిధ రకాల ఫల, పుష్పాలు, విద్యుద్దీపాలతో పోటాపోటీగా ముస్తాబు చేస్తున్నారు. శ్రీనివాసనగర్, పెచ్చెట్టివారిపాలేల నుంచి గరుత్మంతుడు, మాచవరం శ్రీరామనగర్ నుంచి దుర్గమ్మవారు, దొమ్మేటివారిపాలెం (పాత పోస్టాఫీసు) నుంచి శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి వద్ద దొమ్మేటివారిపాలెం, పోతాయిలంక నుంచి ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు నుంచి విజయగణపతి, మాచవరం ఇటికాలమ్మ గుడి, కొత్తపాలెం నుంచి హంస వాహనం, చప్పిడివారిపాలెం నుండి షిర్డి సాయిబాబా, గుత్తుల వారిపాలెం నుంచి సింహం, నందంపూడి నుంచి రాజరాజేశ్వరీదేవి, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు వాహనాలు కొలువుదీరనున్నాయి.





అధునాతన టెక్నాలజీతో బందోబస్తు

సీఐ భీమరాజు



ఉత్సవంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో అధునాతన టెక్నాలజీతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు తెలిపారు. సీఐ, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, అదనపు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు.



సీఎం చంద్రబాబు నుంచి అవార్డును అందుకుంటున్న లొల్ల సర్పంచ్ జగన్నాథం

స్వచ్ఛ అవార్డులు

పంచాయతీ విభాగంలో లొల్ల... రెసిడెన్షియల్ విభాగంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్

ఆత్రేయపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డుకు ఎంపికైంది. ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో పారిశుధ్య నివారణలో లొల్ల గ్రామం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు సోమవారం అమరావతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబుచేతులు మీదుగా లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి కృష్ణామాచార్యులు స్వచ్ఛ అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న సర్పంచ్ జగన్నాథంను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌తో పాటు కూటమి నాయకులు అభినందించారు.

ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్..

సర్పవరం జంక్షన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ ఆశ్రమ స్కూల్ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్) ప్రిన్సిపాల్ సీహెచ్ఎంజీ పరిమళకు స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్స్ (స్టేట్) అవార్డును సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రదానం చేశారు. సోమవారం రాత్రి విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో స్వచ్ఛ అవార్డును బహూకరించారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించేందుకు మొక్కల పెంపకం, సంరక్షణ ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించినందుకు రాష్ట్రస్థాయిలో రెసిడెన్షియల్‌స్కూల్స్ విభాగంలో అవార్డు వచ్చింది.



స్వచ్ఛ బస్టాండ్ కేటగిరీలో అవార్డు స్వీకరిస్తున్న వైవీఎస్ఎన్ మూర్తి



ఎంఎస్ఎంఈ కేటగిరిలో ఎలైట్ ఇన్‌స్ట్రూమెంట్ సంస్థ



స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు స్వీకరిస్తున్న అదనపు కమిషన్ రామలింగేశ్వర్



రెసిడెన్షియల్ కేటగిరీలో అవార్డు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ పరిమళ

అందరికీ తాగునీటి భద్రత ప్రభుత్వ లక్ష్యం

ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్ ఇషాన్ బాషా



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న ఇషాన్‌బాషా

సామర్లకోట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జల జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి పథకాలు రానున్న మూడేళ్లలో పూర్తి చేసుకోవాలని గ్రామీణ నీటిపారుదల విభాగం చీఫ్ ఇంజనీర్ ఇషాన్ బాషా పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజలందరికీ తాగునీటి భద్రత కల్పించాలన్న ప్రధానోద్దేశ్యంతో గ్రామ, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. నీటిపా రుదల విభాగం ఏఈఈలు,డిప్యూటీ ఎంపీడీవోల తొలి బ్యాచ్ శిక్షణా తరగ తులను కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో బాషా సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రమాణాలు పాటించని ఆర్వో కేంద్రాల నీటి వినియోగం బాగా పెరిగిపోయిందని, దీని వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కేవీఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ మూడు రోజులకు ఒక బ్యాచ్ చొప్పున సబ్జెక్ట్ నిపుణులతో రెసిడెన్షియల్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నీటి శుద్ధి పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. మొదటి బ్యాచ్ శిక్షణలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన 40 మంది ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీవోలు హాజరయ్యారు. సోమవారం నుంచి ప్రారంభమైన శిక్షణాతరగతులకు ఉమ్మడి ఐదు జిల్లాల నుంచి 402 మంది హాజరయ్యేందుకు శిక్షణా తరగతులు ఏర్పాట్లు చేసినట్టు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఇవి పూర్తయ్యాక గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కూడా శిక్షణ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ ఎస్ఈ అబ్దుల్ మదీన్, విశ్రాంత ఎస్ఈ ఉమాశంకర్, పెద్దాపురం డీఈ స్వామి, ఈఈశ్రీరామ్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి నన్నయలో మెగా ఫుడ్ ఫెస్టివల్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. సోమవారం వర్సిటీలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో యూనివర్సిటీ కాలేజీలోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగ అధ్యాపకులతో ఫుడ్ ఫెస్టివల్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమై చక్కని రుచులు, అభిరుచులకు వేదికైన గోదావరి జిల్లాల ప్రాశస్త్యాన్ని తెలియజెప్పేలా ఈ ప్రాంత ప్రజల వంటకాల మాధుర్యాన్ని, గొప్ప తనాన్ని ఇనుమడింపజేయడానికి గానూ ఈ నెల 14, 15,16 తేదీల్లో మెగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుంచి సిబ్బంది, విద్యార్థుల కుటుంబ సభ్యులు, స్నేహితులు అందరూ దీనిలో భాగస్వామ్యం కావచ్చన్నారు. మెగా ఫుడ్ ఫెస్టివల్‌కు సంబంధించి 14న క్విజ్, డిబేట్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహిస్తామన్నారు. 15,16 తేదీల్లో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ వర్సిటీ పరిధిలోని ఆసక్తి కలిగిన వారంతా వంటలు సిద్ధం చేసుకుని యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్రదర్శించవచ్చన్నారు. విభిన్న రుచులతో ఆరోగ్యకరమైన, సంప్రదాయ వంటలను ప్రదర్శించిన వారికి 16న బహుమతులు ప్రదానం చేస్తామని వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయ నిర్మల, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య డి.కళ్యాణి, అధ్యాపకులు ఎం.కృష్ణవేణి, కె.సింధుజ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారుల ఎంపికలు



సెలక్షన్స్‌లో ఎంపికైన జిల్లా కరాటే జట్టుతో అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు సంబంధించి బాలురు, బాలికల సెలక్షన్స్ పూర్తయ్యాయి. సోమవారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఫుట్‌బాల్, కరాటే పోటీలకు సంబంధించిన ఎంపికలు చేపట్టారు. ఈ సెలక్షన్స్‌ను రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జోన్-2 జాన్సన్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల జిల్లా టీం, స్టేట్ పోటీల్లో సత్తా చాటి మెడల్స్ తీసుకురావాలని కోరారు.ఎంపికలను డీఈవో కార్యాలయం ఏడీ వెంకట్రాజు, అర్బన్ రేంజ్ డీఐ దిలీప్‌కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీలు ఏవీడీ ప్రసాదరావు, భువనేశ్వరి, తూర్పుగోదావరి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు నాగరాజు పర్యవేక్షించారు.

నెట్‌బాల్ పోటీలకు ముగ్గురు..

ఆత్రేయపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రే యపురం మండలం ర్యాలి హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఆత్రేయపురంలో శనివారం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. సీనియర్ విభాగంలో భవ్యరేఖ, రమాదేవి జూనియర్ విభాగంలో సుస్మిత ఎంపికైనట్టు హెచ్ఎం ఎస్.సూరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను వ్యాయామోపాధ్యాయులు నాగబాబు, సుబ్బారావు, పాఠశాల చైర్మన్ సీహెచ్ దుర్గారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అండర్-17కు ఇద్దరు..

బిక్కవోలు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-17 సైక్లింగ్, మోడరన్ పెంటథలాన్ పోటీలకు పందలపాక ఉన్నత పాఠశాల నుంచి ఇమ్మంది సత్యహరిని, దేవాది అలేఖ్య ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, వారికి తర్ఫీదునిచ్చిన పీడీ డి.యువరాజారెడ్డిని హెచ్ఎంతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

రెజ్లింగ్‌కు ఇద్దరు..

రాజోలు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీల్లో శివకోడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అండర్-17 విభాగం నుంచి మట్టపర్తి బాలవంశీ, అండర్-14 విభాగం నుంచి అప్పారి ఓం సాయిచరణ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఎస్.శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, పీఎంసీ చైర్మన్ అప్పారి శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

స్కేటింగ్ పోటీలకు శ్రీధర్ ఎంపిక

అమలాపురం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి కె.కుమార్‌చందు శ్రీధర్ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు శ్రీధర్ ఎంపికైనట్టు హెచ్ఎం కాశి ఘనసత్యనారాయణ తెలిపారు. శ్రీధర్ వెయ్యి మీటర్ల పోటీల్లో స్వర్ణం, 3వేల మీటర్ల పోటీలో కాంస్య పతకం సాధించాడు. శ్రీధర్‌ను డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా అభినందించారు.



శ్రీధర్‌ను అభినందిస్తున్న డీఈవో సలీంబాషా



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ 1.48 కోట్లు



భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.1,48,77,775 నగదు, 62గ్రాముల బంగారం, 345 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యూఎస్ఏకు చెందిన 76 డాలర్లు, ఇంగ్లాండ్ 15 పౌండ్స్, యుఏఈ 20 దిరహమ్స్ లభించాయి. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా దేవస్థానం సిబ్బంది, సేవాసంస్థల సభ్యులు లెక్కించారు. 35 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన రోజుకు రూ.4.25 లక్షలు భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్నారు.

గుడ్ ఈవినింగ్ క్లిక్..



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరిపై రోడ్డు కం రైల్వే బ్రిడ్జి ఎప్పటికప్పుడు ప్రత్యేకంగానే కనిపిస్తుంది. సోమవారం సూర్యాస్తమయం సందర్భంగా కనిపించిన అందమైన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

సినిమా చూసి వస్తుండగా విషాదం

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



మరణించిన కుశరాజు

గొల్లప్రోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు ఈబీసీ కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్.జగ్గంపేట గ్రామానికి చెందిన గెద్దం లోవకుమార్ శంఖవరం గ్రామానికి చెందిన బంధువు పడాల కుశరాజు (26)తో కలిసి మోటార్‌సైకిల్‌పై ఆదివారం రాత్రి పిఠాపురంలో సినిమా చూసేందుకు వెళ్లారు. సినిమా చూసి తిరిగి వస్తుండగా గొల్లప్రోలు వద్దకు వచ్చేసరికి అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా కుశరాజు మరణించాడు. తీవ్రంగా గాయపడిన లోవకుమార్ చికిత్స పొందుతున్నాడు. గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుల్లెట్‌పై నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన కామరాజు

కరప, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప నక్కావారిపేటలో బుల్లెట్‌పై నుంచి పడి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం తుమ్మలపల్లికి చెందిన ఉల్లం కామరాజు కరపలోని బంధువుల ఫంక్షన్ వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. స్థానిక నక్కావారి ఎస్సీపేటలో శిథిలస్థితిలో ఉన్న వంతెనను దాటుతూ అదుపుతప్పి కిందపడిపోయాడు. కామరాజు ముఖానికి తీవ్ర రక్తపు గాయాలయ్యాయి. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని 108 అంబులెన్స్‌పై కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కరప పోలీసులు విచారణ చేపట్టారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు

గండేపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి గ్రామ శివారులో పెట్రోల్ బంక్ ఎదురుగా సోమవారం రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న కె.సాయి అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొన్నాడు. దీంతో అతడి తల, చేతులకు గాయాలయ్యాయి. సాయి ఏలేశ్వరానికి చెందిన వ్యక్తిగా తెలుస్తుంది. స్థానిక పోలీసులు చేరుకుని క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌పై రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తప్పిన ప్రమాదం

హైవే డివైడర్ పైకి దూసుకెళ్లి ఆగిన ఆటో

గండేపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి జాతీయ రహదారిపై సోమవారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో వెనుక టైర్ పంచర్ కావడంతో డివైడర్ పైకి దూసుకెళ్లి ఆగింది. ఆటో డ్రైవర్ చాకచక్యంగా ఆపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆటో బోల్తా కొడితే పెద్ద ప్రమాదం జరిగేదని వారు భయపడ్డారు.



గండేపల్లి హైవేపై ఆగిన ఆటో

నాన్న... మాకు దిక్కెవరూ!

తాండవ నదిలో పడి పశువుల కాపరి మృతి

అనాథలైన ఇద్దరు చిన్నారులు



ఫైల్‌ఫొటో



భీమరాజు మృతదేహం



బాధలో ఇద్దరు చిన్నారులు

తుని రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తాండవ నదిలో మునిగి పశువుల కాపరి మృతిచెందాడు. దీంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. తుని రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరి లోవ గ్రామానికి చెందిన మండల భీమరాజు (35) పశువులను మేపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. అయితే సోమవారం తాండవ నది తీరాన పశువులు మేపుతూ ఆటు గట్టు వైపు నుంచి ఇటు గట్టుకు పశువులను తరుముతున్న క్రమంలో తాండవ నదిలో నీట మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసినట్టు రూరల్ ఎస్‌ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఆయన చెప్పారు.

ఏడాది కిత్రమే భార్య మృతి...

భీమరాజు భార్య ఏడాది క్రితమే అనారోగ్యంతో మృతిచెందింది. ఇద్దరు ఆడపిల్లలను సాకుతూ పశువులే జీవనాధారంగా కుటుంబాన్ని పోషిస్తున్న భీమరాజు మృతితో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. పశువులను తీసుకెళ్లిన తండ్రి విగతజీవిగామారడంతో కన్నీరుమున్నీరయ్యారు.

దారిలో దంపతులను మింగిన మృత్యువు

కారు ఢీకొని భార్యాభర్తల మృతి

కోటపాడు ఏడీబీ రోడ్డులో ఘటన



మృతిచెందిన దంపతులు గణేష్, వీరలక్ష్మి

రంగంపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌ను కారు బలంగా ఢీకొనడంతో దంపతులు మృతిచెందిన సంఘటన సోమవారం తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం కోటపాడు ఏడీబీ రోడ్డు శ్రీరామ్‌ఫామ్స్ వద్ద జరిగింది. ఎస్‌ఐ ఎస్.శివప్రసాద్ వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణానికి చెందిన కర్రి గణేష్(45) వాలుతిమ్మాపురం లలిత రైస్‌మిల్లులో గోనెసంచులు కుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడి భార్య కర్రి వీరలక్ష్మి(40) రంగంపేట మండలం కోటపాడులోని బీరు ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. వీరలక్ష్మిని బీరు ఫ్యాక్టరీ వద్ద దించేందుకు సోమవారం ఉదయం 7.30 గంటలకు గణేష్ మోటార్‌సైకిల్‌పై సామర్లకోట నుంచి వెళ్తుండగా కోటపాడు ఏడీబీ రోడ్డులో శ్రీరామ్ ఫామ్ వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి రంగంపేట వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొంది. తీవ్ర గాయాల పాలైన భార్యాభర్తలను స్థానికులు 108 అంబులెన్స్‌లో పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఇద్దరూ మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వ్యాపారి హత్య

అలస్యంగా వెలుగులోకి ఘటన



వెంకటేశ్వర్లు (ఫైల్)

ఏలేశ్వరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం డి.కొత్తూరు గ్రామానికి చెందిన అపరాల వ్యాపారి బొది రెడ్డి వెంకటేశ్వర్లు (69) హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏలేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లకు భార్య సత్యవతి, కుమారుడు ఆంజనేయులు ఉన్నారు. కుమారుడు ఏలేశ్వరంలో నివాసం ఉంటున్నాడు. విజయ దశమి పండుగ నేపథ్యంలో ఈనెల 2న వెంకటేశ్వర్ల దంపతులు కొడుకు వద్దకు వచ్చారు. ఈ నేపథ్యంలో కారులో వచ్చిన ఓ వ్యక్తి వెంకటేశ్వర్లను బయటకు తీసుకెళ్లాడు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, వెంకటేశ్వర్లు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కంగారు పడిన కుటుంబసభ్యులు ఏలేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం రాత్రి అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం బుదరాట అటవీప్రాంతం లో మృతదేహం ఉందని అక్కడి పోలీసులు ఏలేశ్వరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు సంఘటనా స్థలానికి వెళ్లి ఆ మృతదేహం వెంకటేశ్వర్లుగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. తర్వాత వారు వెళ్లి నిర్ధారించారు. దాంతో ఏలేశ్వరం పోలీసులు అదృశ్యం కేసును హత్యకేసుగా మార్పు చేశారు. విచారణ తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని తెలిపారు. అయితే వెంకటేశ్వర్లును ఏలేశ్వరం గొల్లల్లమెట్టకు చెందిన రాజా రమేష్ హత్య చేశాడని వెంకటేశ్వర్లు కొడుకు ఆంజనేయులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన తండ్రికి వ్యాపారం నిమిత్తం ఎవరితోనూ విభేదాలు లేవని, కేవలం తన వంటిమీద ఉన్న రూ.10లక్షల విలువ చేసే బంగారం, ధనం కోసం మాత్రమే హత్య చేసి ఉంటాడని పోలీసులకు చెప్పాడు. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న రాజా రమేష్ అడ్డతీగల మండల పరిధిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిసింది.

కారులో వచ్చి కొట్టుకెళ్లారు!

అమలాపురంలో వరుస దొంగతనాలు

ఆధారాలు సేకరించిన క్లూస్‌టీమ్

అమలాపురం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో ఆదివారం రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో రెండు చోట్ల దొంగతనాలు జరిగాయి. కారులో వచ్చి మరీ దొంగలు పడ్డ ఘటనలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. పట్టణ సీఐ పి.వీరబాబు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిని ఆనుకుని ఎర్రవంతెన సమీపంలోని కొల్లూరి బిల్డింగ్ మార్ట్, ఈదరపల్లి బైపాస్ రోడ్డులోని పవన్ మారుతీ కేర్‌లలో దొంగలు పడ్డారు. ఆయా షాపుల యజమానులు జయన గణేష్, కొల్లూరి గుప్తా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. షాపుల తాళాలు పెకిలించడం, గోడలు పగులకొట్టి మరీ చోరీలకు పాల్పడడం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. కారులో వచ్చి మరీ యువకులే ఈ చోరీలకు పాల్పడినట్టు భావిస్తున్నారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. కొంతమేర నగదుతో పాలు విలువైన వస్తువులను అపహరించుకుపోయినట్టు యజమానులు చెప్పారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

గోపాలపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వాహనాల దొంగతనం కేసుకు సంబంధించిన ఇద్దరికి రెండు సంవత్సరాల జైలుశిక్ష విధించినట్టు ఎస్‌ఐ టీ.మనోహర్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... పీ.శివసుబ్రహ్మణ్యం, మరపట్ల రాజ్‌కుమార్‌పై డీలక్స్ మోటార్ సైకిల్ దొంగతనం కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కోర్టులో వారికి రిమాండ్ విధించారన్నారు. దీనిపై చార్జ్‌షీట్ వేయగా కొవ్వూరు రెండో అదనపు జ్యుడిషియల్ మొదటి తరగతి న్యాయమూర్తి కే.నాగలక్ష్మి ఒక్కొక్కరికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ డీ.బాబూరావు వాదాన వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ ఎస్.భాను ప్రాసిక్యూషన్‌కు సహకరించినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్, ప్రయాణికులపై దాడి

కేసు నమోదు



రాయవరంలో సంఘటన వివరాలు తెలుపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

రాయవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌తోపాటు ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తించి పలువురు వ్యక్తులు దాడికి పాల్పడిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని వెదురుపాక సావరం గ్రామానికి చెందిన అనసూరి శ్రీను, అన్నపూర్ణేశ్వరి దంపతులు హైదరాబాదులో పనిచేసుకుని జీవిస్తున్నారు. వారికి చింతపల్లి సత్యసాయి ప్రసన్న, కీర్తన అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సాయి ప్రసన్నను వెదురుపాక సావరం గ్రామంలోని వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. ప్రస్తుతం సాయిప్రసన్న ఐదునెలల బాలింత. ఆమెతో పాటు చంటిబిడ్డను వి.సావరంలోని అత్తవారింటి వద్ద అప్పగించడానికి ఈనెల 5న హైదరాబాదులో బయలుదేరారు. సోమవారం వేకువజామున మాచవరం సెంటర్‌లో బస్సు దిగారు. అక్కడ నుంచి వి.సావరం చేరుకునుందుకు అదే గ్రామానికి చెందిన వాసంశెట్టి రామకృష్ణ ఆటోను మాట్లాడుకున్నారు. మాచవరంలో బస్సు దిగి ఆటో కోసం అనసూరి కీర్తన, సాయిప్రసన్న వేచిచూస్తుండగా తమ కారు ఎక్కాలని, తనపేరు వంశీ అటూ ఒక వ్యక్తి వారి వద్దకు వచ్చి ఇబ్బంది పెట్టాడు. ఈ లోపు ఆటో డ్రైవరు వారి వద్దకు చేరుకుని శ్రీను అతడి కుటుంబసభ్యులను ఆటో ఎక్కించుకుని బయలుదేరాడు. సోమేశ్వరం శివాలయం వద్దకు వచ్చేసరికి వంశీ మరికొందరు వ్యక్తులు కారులో వచ్చి ఆటో డ్రైవర్ వాసంశెట్టి రామకృష్ణపై దాడి చేశాడు. ఆటోలో ఉన్న అన్నపూర్ణేశ్వరి అడ్డుకోగా ఆమెపై దాడికి పాల్పడి ఆమె భర్త శ్రీనుపై దాడి చేసినట్టు బాధితులు తెలిపారు. ఆ వ్యక్తులు తమను పక్కకు నెట్టి వేశారని ప్రసన్న, కీర్తన ఆవేదన వ్యక్తం చేశారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ వాసంశెట్టి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో రాయవరం హెచ్‌సీపీ వీర్రాజు కేసు నమోదు చేశారు.

ఓట్ల చోరీతోనే బీజేపీకి అధికారం

ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం



కాకినాడలో మీడియాతో మాట్లాడుతున్న జేడీ శీలం

కాకినాడ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గత మూడు దఫాలుగా ఓట్ల చోరీతోనే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీకి ఎన్నికల కమిషన్ కొమ్ము కాస్తోందని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం ధ్వజమెత్తారు. సోమవారం ఆయన కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఆగడాలు ఇంకెంతో కాలం సాగవన్నారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీపై నిగ్గు తేల్చాలని రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు 5కోట్ల సంతకాల సేకరణ చేపట్టామన్నారు. త్వరలోనే ఈ సంతకాల మెమోరాండాన్ని రాష్ట్రపతి, ఎలక్షన్ కమిషన్‌కు సమర్పిస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రజల ఓటు హక్కును దోచుకుంటోందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి ఎంఎం.పళ్లంరాజు, ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పాలక్‌వర్మ, కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకరరావు,సత్యానందరావు ఉన్నారు.

స్థలం లీజు విషయంలో మోసం చేశారు

నాకు ప్రాణహాని ఉంది : పిఠాపురం మహారాజా తనయుడు రామరత్నారావు

పిఠాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మహారాజా కోట స్థలం లీజు విషయంలో ప్రముఖ విద్యా సంస్థల అధినేత తనను మోసం చేశారని, ఆయన నుంచి తనకు ప్రాణహాని ఉందని మహారాజా తనయుడు రాజా రావు రామరత్నారావు తెలిపారు. మంగళవారం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తాను కోటకు చెందిన 2 ఎకరాలను కేవలం మూడేళ్లకు మాత్రమే లీజుకి ఇచ్చానని తెలిపారు. తనను మోసగించి దానిని 30 సంవత్సరాలుగా మార్పు చేయడంతో పాటు స్థలాన్ని నాలుగు ఎకరాలకు పెంచి తప్పుడు మార్గాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. దీనిపై తాను గతంలోనే పిఠాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అయినా పోలీసులు స్పందించకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు చెప్పారు. మహారాజా వారసుడిగా తనకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేస్తున్నా అధికారులు స్పందించట్లేదన్నారు. ఈలోగా విద్యాసంస్థల అధినేత అనుచరులు కొందరు తనను హత మార్చేందుకు కుట్ర చేస్తున్నారని, తనకు ప్రాణరక్షణకల్పించాలని ఆయన కోరారు.

దాడి కేసులో ముగ్గురి నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చేసిన ఎస్‌ఐ శ్రీనివాస్‌కుమార్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రెండు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుల మధ్య తలెత్తిన వ్యాపారా విభేదాలతో చాకుతో దాడి చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్టు సర్పవరం ఎస్‌ఐ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో భావనారాయణ స్వామి ముఖద్వారం వద్ద బాలాజీ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, కృపా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తు న్నారు. ఈ రెండింటి మధ్య వ్యాపారాల లావాదేవీల నడుమ ఆగస్టులో ఇరు వర్గాల మధ్య తగాదా జరగడంతో రెండు పక్షాలపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అక్టోబర్ 4వ అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడం, పితాని నవీన్ కుమార్‌పై తుట్టా వెంకట బాలాజీ ఉల్లిపాయలు కోసే చాకుతో దాడికి పాల్పడటంతో తీవ్ర గాయాలయ్యాయన్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేశామ న్నారు. నిందితుల కోసం గాలిస్తూ సోమవారం ఉదయం బాలాజీ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించడం జరిగిందని తెలిపారు.

శ్రీ సంస్థానం భూములకు కౌలు వేలం పూర్తి

తొండంగి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగిలో ఉన్న పిఠాపురం శ్రీ సంస్థానం భూముల కౌలు వేలం పాటలు సోమవారం పూర్తయ్యాయి. ఉదయం ఆరు ప్రతులకు వేలం నిర్వహించారు. కౌలు రైతులు హైకోర్టుకు వెళ్లడంతో వేలం సాయంత్రం 5 గంటల్లోపు నిర్వహించాలన్న కోర్టు ఉత్తర్వులు 3గంటలకు అందడంతో మధ్యాహ్నం మిగిలిన ఆరుప్రతులకు వేలం పూర్తి చేశారు. 12 ప్రతులకు సంబంధించి 57.80 ఎకరాల్లో 11 ప్రతులకు 52.80 ఎకాలకు వేలం పూర్తయ్యింది. ఒక ప్రతికి చెందిన 5 ఎకరాలకు గత కౌలు కంటే తక్కువకు పాట వెళ్లడంతో దానిని వాయిదా వేశారు. వేలం పాటలు జరిగిన 11 ప్రతులకు సంబంధించి గత శిస్తు రూ.3,55,600 కాగా ప్రస్తుం అది రూ.6,08000కు చేరింది. గతం కంటే ఏడాదికి రూ.2,52,400 అదనంగా పెరిగింది. పర్యవేక్షణాధికారి బి.ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఈవో శివబాబు, ఎం.భద్రరావు, డి.శ్రీనివాస్, రఘుబాబు, నాగబాబు పాల్గొన్నారు. తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు కృష్ణమాచారి, జగన్మోహన్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

హై ఓల్టేజీతో గృహోపకరణాల దగ్ధం

మామిడికుదురు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): హై ఓల్టేజీ కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి బాడవ కృష్ణశర్మ కాలనీలో సోమవారం పలు ఇళ్లల్లో గృహోపకరణాలు కాలిపోయాయి. సుమారు 30 ఇళ్లలోని ఫ్రిజ్‌లు, టీవీలు, ఏసీలు, ఫ్యాన్‌లు, ఇన్వర్టర్లు, స్విచ్ బోర్డులు కాలిపోయాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం తాము నిద్రలో ఉండగా ఈ ప్రమాదం జరిగిందని, తీవ్ర భయాందోళనకు లోనయ్యామని, పిల్లలను తీసుకుని బయటకు పరుగులు తీసినట్టు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

తిప్పలు తప్పవా?

సమస్యల వలయంలో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి



వీల్‌చైర్ కదలకపోవడంతో కుంటుకుంటూ ఇలా...



వాడకానికి దూరంగా మూలకు చేరిన వీల్ చైర్



స్ట్రెచర్‌పై అతి కష్టంపై రోగిని మార్చి తీసుకెళ్తున్న రోగి సహాయకులు



రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి (జీజీహెచ్) పరిస్థితి దారుణంగా తయారైంది. అడుగుపెట్టడంతోనే తిప్పలు ప్రారం భవుతున్నా యి. స్ట్రెచర్, వీల్ చైర్లు అందుబాటులో ఉండడం లేదు. స్ట్రెచర్ బేరర్ ఊసే లేకపోవడంతో రోగితో వచ్చిన సహాయ కులే తంటాలు పడాల్సి వస్తోంది. వీల్ చైర్లు అవసాన దశకు చేరి మొరాయిస్తుండ డంతో రోగులు కుంటు తూ, వేరొకరి సహాయంతో కష్టంగా వైద్యుడి వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఈ తిప్పలు అత్యవసర వైద్యం నిమిత్తం వచ్చే రోగులకు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. వీల్‌చైర్లు, స్ట్రెచర్ల నిర్వ హణకు ఉద్యోగిని కేటాయించినా సొంత పనులకు సొంతమ య్యారు. ఆస్పత్రికి ఒక డిప్యూటీ కలెక్టర్‌ని ప్రత్యేక అధికారిని నియమించారు. వారానికి రెండుసార్లు ఆయన ఆస్పత్రికి రావాలి. రోగుల బాధలు వినాలి. కానీ ఏదైనా ఘటన జరిగినప్పుడే ఆయన అలికిడి కనిపిస్తుందనే విమర్శలు ఉన్నాయి. 2022 డిసెంబరు 21న వైద్య విద్య డైరెక్టర్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం అత్యవసర రోగులను రిసీవ్ చేసుకోడానికి ఆస్పత్రి ప్రవేశం/క్యాజువాలిటీ వద్ద రెండేసి చొప్పున స్ట్రెచర్లు, వీల్‌చైర్లు, ఒక్కొక్కరు చొప్పున ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో, డాక్టరును నిరంతరం అందుబాటులో ఉంచాలి. కానీ ఆదేశాలను కూడా నిర్వీర్యం చేశారు. ఈ తీరు ప్రభుత్వంపై జనాల ఆగ్రహానికి కారణమవుతోంది. ఇక దాతలు ఇస్తున్న స్ట్రెచర్లు, వీల్‌చైర్లు ఏమవు తున్నాయో తెలియదు. కొత్త కలెక్టర్ అయినా పెద్ద మనసుతో ఆస్పత్రిపై దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరిస్తారని రోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

-రాజమహేంద్రవరం, (ఆంధ్రజ్యోతి)

విద్యార్థులు లక్ష్యం దిశగా పయనించాలి

ఆర్ట్స్ కళాశాలలో దీక్షారంభం కార్యక్రమంలో ఆర్‌జేడీ కృష్ణాజీ


ఆర్‌జేడీకి స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యం దిశగా పయనించాలని జోన్ 1, 2 ఆర్‌జేడీ పీవీ కృష్ణాజీ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు దీక్షారంభం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణాజీకి ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మొక్కను అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలలో విద్యనభ్యసించడం విద్యార్థులకు వరమని, ఇక్కడ ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలు, గొప్ప విద్యావేత్తలు విద్యనభ్యసించారన్నారు. ప్రిన్సిపాల్ కళాశాల గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కళాశాల వివిధ విభాగాధిపతులు మాట్లాడారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి: ఆర్డీవో

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం ఏడు అర్జీలు రావడం జరిగిందని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందని అన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కార తీరు ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. వివిధ శాఖలకు చెందిన డివిజన్ స్థాయి అధికారులు, కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనపర్తికి మూడు స్వచ్ఛ అవార్డులు



స్వచ్ఛ పంచాయతీ అవార్డు అందుకుంటున్న కుతుకులూరు సర్పంచ్

అనపర్తి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందించిన వారికి ప్రకటించిన అవార్డుల్లో అనపర్తి మండలం మూడు అవార్డులను కైవసం చేసుకుంది. వీటిలో పారిశుధ్య నిర్వహణలో కుతుకులూరు జిల్లా ఉత్తమ పంచాయతీ అవార్డు సాధించగా గ్రామానికి చెందిన బత్తిన రాజు ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ గాను, అనపర్తి బాలుర ఉన్నత పాఠశాల ఉత్తమ పాఠశాలగా ఎంపికయ్యాయి. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ పంచాయతీకి కుతుకులూరు సర్పంచ్ గొల్లు హేమతులసి, కార్యదర్శి ఎస్ఎస్ ఫణికుమార్, ఉత్తమ జిల్లా గ్రీన్ అంబాసిడర్‌గా రాజు, ఉత్తమ పాఠశాలకు హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నుంచి అవార్డులు అందుకున్నారు.

బలభద్రపురంలో నూతన విగ్రహాలకు గ్రామోత్సవం


శివాలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలు

బిక్కవోలు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో రూ.8లక్షల వ్యయంతో శివాల యాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతిష్ఠించే ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ పీఠ దేవతా మూర్తులకు, విద్యాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, కాలభైరవ, జయ, విజ య నందీశ్వర, చండీశ్వర, మేధా దక్షిణామూర్తి, నవగ్రహాలకు సోమవారం మేళతాళాలతో గ్రామోత్సవం జరిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

బిక్కవోలు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని బాణసంచా తయారీదారులకు సీఐ సుమంత్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని బాణాసంచా తయారీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్సుల కాలపరిమితి, నింబంధనల ప్రకారం స్టాకు నిల్వలు, తయారైన బాణసంచా, అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకున్న జాగ్రత్తలను పరిశీలించారు. సీఐ వెంట తహశీల్దార్ సత్యకృష్ణ, ఎస్ఐ రవిచంద్రకుమార్, అనపర్తి అగ్నిమాపకదళ అధికారి ఎ.శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

భావిభారత పౌరుల రూపశిల్పి ఉపాధ్యాయుడు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో భావి భారత పౌరులను తీర్చిదిద్దే రూపశిల్పి ఉపాధ్యాయుడే అని రాష్ట్ర ఉత్తమోపాధ్యాయ అవార్డుగ్రహీత ముంగండి సూర్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక ఆంధ్రనగర్‌లోని పవర్స్ ఎయిడెడ్ ఇంగ్లీష్ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. హెచ్‌ఎం వి.పద్మజ, తల్లిదండ్రుల కమిటీ తరఫున పైలా రాంబాబు మాట్లాడారు. కార్యక్రమంలో సెయింట్ జాన్స్ పాఠశాల డైరెక్టర్ జాన్సన్, ఉపాధ్యాయులు నాగరాజు, సీఆర్ఎంటీ జయంతిశాస్త్రి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

14న ఉచిత వైద్యశిబిరం

రాజమహేంద్రవరం కల్చరల్ అక్టోబర్6(ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ హాల్‌లో ఈ నెల 14న పంతం చారిటబుల్ ట్రస్టు, బీసీఎన్, సీసీసీ చానెల్ సంయుక్త ఆధ్వర్యంలో కేబుల్ ఆపరేటర్లకు, వారి కుటుంబాలకు, రాజమండ్రి ప్రెస్ క్లబ్ సభ్యులకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ పంతం కొండలరావు తెలిపారు. స్థానిక వై-జంక్షన్‌లోని రోటరీ హాల్‌లో నిర్వహించబోతున్న ఈ శిబిరంలో హైదరాబాద్ యశోద ఆసుపత్రి వైద్యులు సేవలందిస్తారని చెప్పారు. శిబిరానికి రాదలిచిన వారు ఈ నెల 12వ తేదీ లోపు స్థానిక సీసీసీ చానెల్‌కు వచ్చిగాని, సెల్ 8978555312కు ఫోన్ చేసి నమోదు చేయించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 91541 72491, 77021 63555 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ: జేసీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రభుత్వం,జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని జాయింట్ కలెక్టర్ వై.మేఘ స్వరూప్ పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 871 రేషన్ షాపులు సక్రమంగా పని చేస్తున్నాయని, 94%వరకూ సరుకులు సమయానికి సరఫరా అవుతున్నాయని చెప్పారు. అదనంగా 76షాపులను ప్రతిపాదించామన్నారు. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి హేతుబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు.రేషన్ పంపిణీపై అభిప్రాయాలను తెలిపేందుకు లబ్ధిదారులకు అందుబాటులో క్యూఆర్ కోడ్‌లను ఉంచామన్నారు. ఇప్పటివరకూ ఆలస్యం, రేషన్ అందకపోవడం వంటి ఫిర్యాదులు రాలేదన్నారు. ఎక్కడ ఇబ్బంది తలెత్తినా వెంటనే చర్యలు తీసుకోడానికి జిల్లాస్థాయిలో హెల్ప్‌లైన్ నెంబర్లు, పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు.

రాజకీయాల్లో నాకు నాన్నే ఆదర్శం

పెందుర్తి అభిరామ్

కోరుకొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ తమకు ఆదర్శమని టీడీపీ నాయకుడు పెందుర్తి అభిరామ్ అన్నారు. సోమవారం కోరుకొండ టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన తండ్రి హయాంలో నియోజకవర్గంలో సంక్షేమ అభివృద్ధే అజెండా తప్ప, రౌడీయిజం, అల్లరి మూకల ఆకృత్యాలు, ప్రకృతి వనరుల దోపిడీ వంటివి లేవన్నారు. మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని విద్య, వైద్యం, అన్ని విధాలుగా అండగా ఉంటూ ప్రజలకు చేరవవుతున్న తనపై టీడీపీకి చెందిన ఒక వర్గం అసత్య ప్రచారాలు చేస్తోందని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, దీనికి సంబంధించి పోలీసుల దర్యాప్తు చేస్తున్నారన్నారు. తన తప్పు ఉంటే శిక్షకైనా సిద్ధమన్నారు.మరో వర్గం తప్పయితే క్షేమించేది లేదని, సాక్షాలతో సహా వీరి బండారం త్వరలోనే బయట పెడతానని అభిరామ్ అన్నారు.

శ్యామలాంబ దేవస్థాన కమిటీ ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని కొత్తపేటలో శ్యామలాంబ దేవసాజిఖినం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం సోమవారం రాత్రి జరిగింది. ఛీటీనికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌గా కడియాల వీరభద్రరావు, డైరెక్టర్లుగా ఏపీఎస్ అప్పారావు, బోను ఈశ్వరి, మల్లపురెడ్డి వరలక్ష్మి, కురగంటి శ్రీనాద్, తాడివలస వెంకటలక్ష్మి, అడ్లూరి చంద్రశేఖర్, కారుమూరి సురేష్, కెళ్ళ జయలక్ష్మి, తొర్లపాటి షాలిని, ఎక్‌ఆఫీషియో సభ్యులుగా ఎం.పద్మావతిలతో ప్రమాణస్వీకారం చే యించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మధురమే కానీ!



100 సీతాఫలాలు రూ.1600

- మండుతున్న ధరలు
- కొనుగోళ్లకు వెనుకంజ
- సహకరించని వాతావరణం
- ధర ఉన్నా.. దిగుబడి లేదు
- లబోదిబోమంటున్న రైతులు

నల్లజర్ల/దివాన్‌చెరువు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నోరురించే మధుర ఫలమైన సీతాఫలం ధరలు మండుతున్నాయి. ఈ ఏడాది దిగుబడి తక్కువగా ఉండడంతో మార్కెట్‌లోకి విరివిగా రావడం లేదు. వినియోగదారుల నుంచి డిమాండ్‌కు తగిన సప్లై లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. దూబచర్ల మార్కెట్‌లో 100 సీతాఫలాలు రూ.1600 ధర పలుకుతోంది. నల్లజర్ల మండలం పుల్లలపాడు, ముసుళ్ళకుంట, కొత్తగూడెం, ఆయ్యవరం, జి.కొత్తపల్లి, రామశింగవరం గ్రామాల నుంచి దూబచర్ల గ్రామానికి, రాజానగరం మండలం శ్రీరాంపురం, శ్రీకృష్ణపట్నం, కానవరం, వెలుగుబంద గ్రామాల నుంచి దివాన్‌చెరువు గ్రామానికి సీతాఫలాలు వస్తుంటాయి. దూర ప్రాంతాలకు వెళ్లే వారు, స్థానికులు ఇక్కడే కొనుగోలు చేసి రవాణా చేస్తారు.

ప్రతికూల వాతావరణం

ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో సీతాఫలాల దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాపు లేదు, కాయరాదు, వచ్చిన కాయలకు మంచి సైజులేదు అంటూ కొంతమంది వాపోతున్నారు. ఈ కారణంగా రైతులకు రావలసిన ఆదాయం తగ్గడంతోబాటు చిరు వ్యాపారులకు సైతం నిరాశే మిగిలింది. పండ్లు దిగుబడి తగ్గడంతో ధరలు ఆకాశానంటుతున్నాయని, దీని వల్ల తాము సీతాఫలాన్ని చూసి ఆనందించడమే తప్ప రుచి చూసే భాగ్యం కలగడం లేదని సామాన్యులు అంటున్నారు. రాజానగరం మండలం దివాన్‌చెరువు, శ్రీరాంపురం, శ్రీకృష్ణపట్నం, కానవరం, వెలుగుబంద గ్రామాల్లో దాదాపు 135 ఎకరాల్లో సీతాఫలాలు విస్తరించి ఉన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వివిధ పండ్ల తోటల్లో చెట్ల మధ్య, గట్లపైన సరిహద్దులలోనూ ఈ సీతాఫలం చెట్లు ఉంటాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి తగ్గి పోయిందని రైతులు చెబుతున్నారు. సాధారణంగా ఆగస్టు నుంచి ప్రారంభమై నవంబరు నెల వరకూ ఈ పండ్ల సీజన్ ఉంటుంది. మే నెలలో కురిసిన వర్షాలు కారణంగా ముందుగానే ప్రారంభమైన సీజన్ మరో వారం, పదిరోజుల్లో ముగిసిపోతుందని కొంతమంది వ్యాపారులు అంటున్నారు. సాధారణంగా రోజుకు రెండుసార్లు కాయలు కోస్తారు. అయితే ప్రస్తుతం కాపు తక్కువగా ఉండడంతో ఒక్కసారే కోస్తున్నామని కొందరు రైతులు వాపోయారు. మే నెలలో తుఫాన్ వల్ల కాయసైజు తగ్గిందని అంటున్నారు. అననుకూల వాతావరణం కారణంగా కాపు తగ్గడానికి తోడు కోతుల బెడద కూడా ఎక్కువగా ఉందని వాటి నుంచి కాయలను కాపాడుకునేందుకు కాపలాదారులను ఏర్పాటు చేసుకోవలసి వస్తోందని శ్రీరాంపురం గ్రామానికి చెందిన వంశీ చెప్పారు. దీనితో అదనంగా ఖర్చులు అవుతున్నాయన్నారు. దివాన్‌చెరువు గ్రామంలో జాతీయ రహదారి వెంట కొంతమంది వ్యాపారులు బుట్టలలో సీతాఫలాలను ఉంచి అమ్మకాలు సాగిస్తారు. ఈ రహదారి మీదుగా ప్రయాణించే దూరప్రాంతాల వారు ఇక్కడ కొనుగోలు చేసుకుని తమ స్వస్థలాలకు తీసుకువెళ్తారు. అలాగే దూరప్రాంతాల్లో ఉండే తమ బంధువులకు కొంతమంది స్థానికులు ఈ పండ్లను ఇక్కడి నుంచి పంపుతూ ఉంటారు. ఇక్కడి సీతాఫలం రుచి చూసిన వారు మరోసారి ఇక్కడి పండ్లనే తినాలని ఎదురు చూస్తుంటారు. కాగా ప్రస్తుతం 100 కాయలు రూ.1500 నుంచి రూ.2500 వరకూ ధర పలుకుతోందని సామాన్యులు వాపోతున్నారు. దీనితో సీతాఫలం రుచి చూడాలని ఆశపడడం తమ వంటి సామాన్య, మధ్యతరగతి వారికి తినడం సాధ్యం కావడం లేదని పలువురు అంటున్నారు.


దూబచర్లలో సీతాఫలాల మార్కెట్

భయపెడుతున్న ధరలు

సీతాఫలాలు ధరలు పెరగడంతో వాటిని కొనుగోలు చేసేందుకు జనం జంకుతున్నారు. ఇక్కడి నుంచి బంధువులకు, స్నేహితులకు కొని పంపించాలని ఉన్నప్పటికీ అధిక ధరలు ఉండడంతో ఇంటి వరకే డజను కాయలతో సరిపెట్టుకుంటున్నారు. మండలంలో సీతాఫలం మార్కెట్ దూబచర్లలోనే ఉంది. హోల్‌సెల్‌గా విక్రయించే దూబచర్లలోనే 100 కాయలు రూ.1600 అంటే జనం హడలిపోతున్నారు.

కొనుగోళ్లు అంతంతమాత్రమే



దూబచర్ల గ్రామానికి చుట్టు పక్కల 16 గ్రామాల నుంచి గతంలో విరివిగా సీతాఫలాలు వచ్చేవి. ప్రస్తుతం పంట విస్తీర్ణం తగ్గింది. దీనికి తోడు ఈ ఏడాది దిగుబడి తక్కువగా ఉంది. పండుగల సీజన్ ప్రారంభం కావడంతో సీతాఫలానికి డిమాండ్ ఎక్కువగా ఉంది. ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరిగాయి. దాంతో కొనుగోలు చేసే వారి సంఖ్య తక్కువగా ఉంది.

-సత్యనారాయణ, వ్యాపారి, దూబచర్ల.

నత్తల నివారణకు చర్యలు చేపట్టాలి

సీతానగరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) నత్తల నివారణకు చర్యలు రైతులు సామూహకంగా చేపట్టాలని ఉద్యావన అధికారిణి రీన సూచించారు. సోమవారం మిర్తిపాడు, ఉండేశ్వరపురం గ్రామాల్లో క్షేత్రసాయి పర్యటన ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నత్తలు ఆశించిన పంటల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు రైతులకు అవగాహన కల్పించారు.

పశుపోషణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే జ్యోతుల, ఎమ్మెల్సీ పేరాబత్తుల


గోకులం షెడ్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, ఎమ్మెల్సీ రాజశేఖరం

గోకవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి జీవనోపాధిగా మారిన పశుపోషణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. మండలంలోని కామరాజుపేట పంచాయతీ పరిధిలోని జగన్నాథపురంలో పాడి రైతు పిల్లి సత్యనారాయణ ఇంటి వద్ద ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన గోకులం షెడ్ నిర్మాణానికి సోమవారం వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతీ పాడిరైతుకు మినీ గోకులం షెడ్ మంజూరు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో పశుపోషణ, కోళ్ళ, గొర్రెలు, మేకల పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కాకినాడ జిల్లాలోకెల్లా జగ్గంపేట నియోజక వర్గానికే ఎక్కువ షెడ్లు కేటాయింపు జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో జీఎస్టీ 2.0పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడు తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా తీసుకొచ్చిన సూపర్ జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాల వారికి ప్రయోజనం కలుగుతుందన్నారు. భూపతిపాలెం గురుకుల పాఠశాల్లో స్వచ్ఛ భారత్ మిషన్ పథకంలో భాగంగా సుమారు రూ.60 లక్షలతో నిర్మించనున్న మరుగుదొడ్ల పనులకు వారు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అడపా భరత్, సర్పంచ్ అడపా వెంకటరావు, సొసైటీ చైర్మన్ పిర్ల వెంకటేశ్వరరావు, గురుకుల పాఠశాల చైర్మన్ గళ్లా రాము, నాయకులు పిల్లా చంటిబాబు, కన్నబాబు, ఎంపీడీవో గోవిందు, ఏపీవో అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 12 మంది అరెస్టు

రూ.19,840 నగదు, 9సెల్‌ఫోన్లు, 9 మోటార్‌సైకిళ్లు స్వాధీనం

రాజానగరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీకృష్ణపట్నం గ్రామంలో మార్గాని వెంకటేశ్వరరావు ఫామ్ హౌస్‌లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.19,840 నగదుతో పాటు 9 సెల్‌ఫోన్లు, 9 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నారాయణమ్మ తెలిపారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రతి ఇంటికి లాభం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


జీఎస్టీపై అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలతో ప్రతి ఇంటికి లాభం చేకూరుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 24వ డివిజన్‌లో కూటమి నాయకులతో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వాసు డివిజన్‌లో వ్యాపార దుకాణాలు, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. దేశీయ ఉత్పత్తులు కొనుగోలు చేస్తే దేశాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములవుతారని ఈ సంస్కరణలు ప్రతి ఇంటికి లాభం కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా నియమితులైన తురకల నిర్మల ఎమ్మెల్యే వాసును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువతో సత్కరించారు. బ్యాంక్ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు.

ఊలపల్లిలో వైభవంగా గౌరిదేవి ఉత్సవాలు


ఊలపల్లిలో గౌరమ్మను ఆలయానికి తీసువస్తున్న భక్తులు

బిక్కవోలు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఊలపల్లిలో రెండేళ్లకొకసారి జరిగే వెలమల ఆరాధ్య దైవమైన గౌరిదేవి ఉత్సవాలను సోమవారం వైభవంగా ప్రారంభించారు. గ్రామంలోని రెండు వెలమ వర్గాలు ఈ ఉత్సవాలను పోటాపోటీగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గత నెల 23న కొయ్యచెక్కను గ్రామంలోని వడ్రంగికి ఇరు వర్గాల వారు ఇచ్చి గౌరిదేవి విగ్రహాలను తయారు చేయించారు. విగ్రహాలు తయారవ్వడంతో సోమవారం విగ్రహాలను మేళతాళాలు, విచిత్ర వేషధారణలు, బ్యాండు కచేరీలతో వాటిని వెలంపేటలోని రామాలయం, లక్ష్మీ గణపతి ఆలయాల్లో వుంచి పక్కన వరిదుబ్బును ఉంచారు. ఈనెల 31 వరకూ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుపుతారు. 31న ఉత్సవాన్ని నిర్వహిస్తారు. కార్యక్రమంలో అనపర్తి, మండపేట నియోజకవర్గాల వెలమ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కర్రి శ్రీనివాసరావు, గేదెల వీరబాబు, మాజీ సర్పంచ్ గేదెల సత్యనారాయణ, పెద్దలు పాల్గొన్నారు.

కోరుకొండ పీహెచ్‌సీ వద్ద గాదరాడ వాసుల ధర్నా

కోరుకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ పీహెచ్‌సీ ఎదురుగా సోమవారం గాదరాడకు చెందిన కొందరు గ్రామస్థులు తోరాట శ్రీను నాయకత్వంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 30న గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పాముకాటుకు గురై ఆసుపత్రికి తీసుకువస్తే ఇక్కడ వైద్యులు అందుబాటులో లేరని అతనికి పాముకాటు వ్యాక్సిన్ వేయలేదని రాజమహేంద్రవరం తీసుకువెళుతుంటే మార్గమధ్యంలోనే మృతి చెందాడన్నారు. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించి ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పీహెచ్‌సీకి వచ్చి వైద్యాధికారులను జరిగిన విషయం అడిగి తెలుసుకున్నారు. ఆపదలో ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో జంబుపట్నం మాజీ సర్పంచ్ నాగా సత్యనారాయణ, ఉల్లి గణ, పలువురు వైసీపీ నాయకులు, గాదరాడ గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

సీతానగరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపాక గ్రామానికి చెందిన మద్దాల వెంకట అప్పారావుకు చెందిన పాడిగేదె విద్యుత్ షాక్ గురై మృతిచెందింది. సోమవారం ఉదయం మేత కోసం వెళ్లిన గేదె తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో రాపాక శివారు కోటికేశవరం రోడ్డులో సుమారు సాయంత్రం 4 గంటల ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ వద్ద వైరు తెగి గేదెపై పడడంతో షాక్‌కు గురై సంఘటనా స్థలంలోనే మృతిచెందింది. పశువైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి

గోకవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. గోకవరంలోని సూర్యఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. డీఎస్సీ నిర్వహించి సుమారు 16,000 టీచర్ పోస్టులను భర్తీ చేసిందన్నారు. ఎమ్మెల్సీ రాజశేఖరం మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీతలను సత్కరించారు.

అనపర్తి: ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు అందుకున్న కుతుకులూరు ఉపాధ్యాయులను సోమవారం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామ పెద్దలు సత్కరించారు. కుతుకులూరు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న నక్కిన వీరరాఘవులు రాష్ట్ర ఉత్తమోపాధ్యాయ అవార్డు, కందికట్ల రూథర్ పాల్ జిల్లా ఉత్తమోపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విజయభారతి అధ్యక్షతన జరిగిన సన్మాన సభకు పలువురు ప్రముఖులు హాజరై ఉత్తమోపాధ్యాయుల సేవలు కొనియాడారు. ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తమలంపూడి సూరారెడ్డి, నల్లమిల్లి తాతారెడ్డి, కొవ్వూరి రామారెడ్డి, సత్తి దొరారెడ్డి, పులగం సంతోషిలక్ష్మి, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గండి స్వామి ప్రసాద్, పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి

రాజానగరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులంతా జాబ్ కార్డులతో విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీఈవో జేఏ రూపన్సీ తెలిపారు.సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలో 15,370 ఉపాధి వేతనదారులకుగానూ ఇప్పటి వరకు 3,600 మంది మాత్రమే ఈకేవైసీ పూర్తి చేశారన్నారు. యాప్‌లో ముఖ హాజరు అనుసంధానం ఉన్నవారు మాత్రమే పనులకు వచ్చేందుకు అర్హులన్నారు.ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని ఎంపీడీవో కోరారు.

జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసన

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఘోరమైన సంఘటనగా న్యాయవాదులు భావిస్తూ దీనిని తీవ్రం గా ఖండిస్తూ రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏపీ ఎస్సీఎస్టీ బీసీ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషన్స్ అసోసియేషన్, దళిత ,గిరిజన ప్రజాసంఘాలు, న్యాయవాదుల ఆధ్వ ర్యంలో నిరసన ధర్నా చేశారు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ధర్నాలో ప్రముఖ న్యాయవాది మర్రి బాబ్జి, దళిత నాయకు డు కాశి నవీన్‌కుమార్ మాట్లాడారు. చీఫ్ జస్టిస్‌పై దాడి అత్యంత హేయమైన చర్య గా భావిస్తున్నామన్నారు. ఈ సంఘటనపై ప్రధాన మంత్రి, దేశ హోంమంత్రి తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి నెలరోజుల లోపే నిందితుడ్ని శిక్షించాలని డిమాండ్ చేశారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: కిష్కింధపురి
సూర్యమినీ	: అవతార్, సన్నీ సంస్కారికి తులసీకుమారి
సూర్యప్యాలస్	: కాంతారా-1
స్వామి	: ఓజీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: ఓజీ
శివజ్యోతి	: ఓజీ
రాజా	: ఓజీ
ఊర్వశి	: కాంతారా-1
మేనక	: ఇడ్లీ కొట్టు
రంభ	: మిరాయ్
అప్సర	: కాంతారా-1
అశోక	: ఇడ్లీ కొట్టు
వీఎస్ మహల్(నామవరం)	: మిరాయ్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కాంతారా-1, ఓజీ
వెంకటసూర్య(కడియం)	: ఓజీ
సత్యగౌరి (అనపర్తి)	: ఓజీ
సూర్యశ్రీ (అనపర్తి)	: కాంతారా-1
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: కాంతారా-1, ఓజీ
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: కాంతారా-1
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఓజీ
లలితామహాల్(రంపచోడవరం)	: మహావతార్ నరసింహ
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు





కష్టాల క్యూ : ఇరుకు సందులో అర్జీదారులు

పెద్దేవంలో ఆగని గేదెల మృత్యుఘోష

మరో ఇద్దరు రైతుల గేదెలకు వ్యాధి

తాళ్లపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దేవం గ్రామంలో గేదెల మృత్యుఘోష ఆగలేదు. ఇంకనూ వరుస మరణాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. నేటికీ గ్రామంలో 40 గేదెల వరకూ మృత్యువాతపడ్డాయి. సోమవారం కొత్తగా ఇద్దరు రైతుల గేదెలకు వ్యాధి సోకిందని సమాచారం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పశు సంవర్ధక అధికారి శ్రీనివాస్ తమ సిబ్బందితో సోమవారం గ్రామానికి విచ్చేశారు. అప్పటికే ఒక రైతు వ్యాధి సోకిన రెండు గేదెలను కబేళాకు పంపించేశారు. గేదె మరణిస్తే ఖననానికి సుమారు రూ.10 వేలు ఖర్చవుతుందని.. అదే కబేళాకి తరలిస్తే కనీసం రూ.30 వేలు వస్తున్నాయని పాడి రైతులు అంటున్నారు. జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో రైతులు సహకరించడంలేదని.. వ్యాధి బారిన పడిన గేదెలను ఆసుపత్రికి తరలిస్తేనే పూర్తి వైద్యం అందించ గలమని అధికారులు అంటున్నారు. కానీ రైతులు మాత్రం గేదెలను ఇవ్వమని తేల్చి చెబుతున్నారన్నారు.



వ్యాధి బారిన పడిన గేదెను పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖాధికారి శ్రీనివాస్ తదితరులు



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి చిత్రంలో జేసీ మేఘ స్వరూప్ తదితరులు

కలెక్టరేట్‌కు స్థానిక సమస్యలు వద్దు

పీజీఆర్ఎస్‌లో అధికారులను ఆదేశించిన కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం రూరల్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల, డివిజన్ స్థాయిలోనే స్థానిక సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. తహశీల్దార్, ఎంపీడీవోలు వ్యక్తిగత బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఇకపై అంశాల వారీగా అర్జీలపై మండలాల వారీగా విశ్లేషణ చేయడం జరుగుతుందని తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘస్వరూప్ డీఆర్‌వో సీతారామమూర్తి ప్రజల నుంచి 149 అర్జీలు స్వీకరించారు. సమస్యలు జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు రాకుండా స్థానికంగానే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సర్వే, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి అర్జీలు అధికంగా వస్తున్నాయన్నారు. ఆయా శాఖల అధికారులు పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు.గ్రామాల్లో రీ సర్వే చేస్తుంటే సంబంధిత భూయజమానులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలన్నారు.మ్యుటేషన్ల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. భూముల మ్యుటేషన్ తిరస్కరణకు కారణాలను స్పష్టంగా వివరించే స్పీకింగ్ ఆర్డర్ తప్పనిసరిగా ఇవ్వాలని తహశీల్దార్లకు సూచించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 25 అర్జీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. 25 అర్జీలను స్వీకరించినట్టు తెలిపారు.



ప్రయాణ బాదుడే!

ప్రైవేట్ ట్రావెల్స్ మహా దోపిడీ

టిక్కెట్ కొనలేక ఇక్కట్లు..

ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ మితిమీరిపోయింది. ప్రైవేటు బస్సు ఆపరేటర్లు బస్సు రకాన్ని బట్టి వసూలు చేస్తున్నారు.మల్టీ యాక్సిల్, భారత్ బెంజ్, వోల్వో, స్కానియా ఇలా తయారీదారులు, సాంకేతికత పేరు చెప్పి మరీ బాదేస్తున్నారు. అయినా పట్టించుకున్నవాళ్లే లేరు. బెంగళూరుకు సాధారణంగా మామూలు రోజుల్లో టిక్కెట్ రూ.2 వేల లోపే ఉంటుంది. ప్రస్తుతం రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకూ లాగేస్తు న్నారు.హైదరాబాద్‌కు సాధారణ రోజుల్లో రూ.1200 నుంచి రూ.1500 ఉంటుంది. ప్రస్తుతం గరిష్ఠంగా రూ.4,700ల వరకు వసూలు చేస్తు న్నారు. చెన్నై అయితే రూ.1800 ఉంటుంది. ప్రస్తుతం రూ.4 వేల వరకూ ఉంది. ప్రైవేటు బస్సు టికెట్లకు గొలుసుకట్టులా ఏజెంట్లు ఉండడంతో వాళ్ల కమీషన్‌ని కూడా ప్రయాణికుల నుంచే వసూలు చేస్తుండడంతో టికెట్ ధర అమ్మో అనిపిస్తోంది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల గుండా ప్రయాణించే ప్రైవేటు బస్సులకు సంబంధించి 50కిపైనే ఆప రేటర్లు ఉన్నారు. వీళ్లందరూ పండుగల వేళ ధరలను అమాంతం పెంచేస్తున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

దసరా సెలవులు ముగిశాయి. ఊళ్లకు వచ్చిన జనం ఇంటిబాట పట్టారు. ముందుగా ప్లాన్ చేసుకున్న వాళ్ల సంగతి బాగానే ఉన్నా.. మిగతా ప్రయాణికులకు మాత్రం ప్రయాణ నరకం తప్పడం లేదు.ఒక వైపు రైళ్లలో రిజర్వేషన్లు నిండుకున్నాయి. తత్కాల్‌లోనూ ఖాళీలు లేవు. ఇదే అదనుగా మరో వైపు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ఆపరేటర్లు అమాంతం ధరలు పెంచేశారు. బెంగళూరుకు ఏకంగా రూ.5 వేల వరకూ వసూలు చేస్తున్నారు.ఓ నలుగురు ఉన్న కుటుంబం వెళితే అక్షరాలా రూ.20 వేలు చార్జీలకే అవుతోంది. ప్రైవేటు బస్సుల బాదుడుపై విశాఖపట్నం జిల్లా రోడ్డు రవాణా అధికారులు కన్నెర్ర చేశారు. ఉమ్మడి తూర్పు అధికారులు మాత్రం ఇంకా కన్ను తెరవలేదు. అత్యవసరంగా వెళ్లాలంటే అప్పు తప్పదన్నట్టు పరిస్థితి ఉంది.

గోదావరి జిల్లాల నుంచే రద్దీ..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ఎక్కువగా ప్రయాణాలు సాగిస్తారు. ఉపాధికి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడానికి కోనసీమ జిల్లా నుంచి ఎక్కువగా వెళుతుంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సాఫ్ట్‌వేర్ తదితర ఉద్యోగాల్లో ఉన్న యువత ఎక్కువే. పండుగ వేళల్లో తమ ఊళ్లకు వస్తుంటారు. పండుగ ముగిసిన వెంటనే తిరుగు ప్రయాణం అవుతారు.అధిక శాతం రైలులోనే ప్రయాణిస్తారు. ఎందుకంటే ధర తక్కువ. అయితే రైలులో బెర్తులు నిండుకోవడంతో ప్రత్యామ్నాయం చూస్తున్నారు. దీంతో ప్రైవేటు బస్సుల వైపు చూస్తున్నారు. బస్సుల్లో బాదుడు విపరీతంగా ఉంది. దీంతో ప్రయాణ తిప్పలు తప్పడం లేదు.చెన్నై, బెంగళూరుకు ఆర్టీసీ బస్సులు లేవు. హైదరా బాద్‌కి ఉన్నా ధరలు తక్కువ వల్ల ముందుగానే రిజర్వేషన్లు పూర్తవుతున్నాయి. దీంతో ప్రైవేటు బస్సులపై ఆధారపడక తప్పడం లేదు.

మన అధికారులేం చేస్తున్నారు?

ఒకవైపు ప్రయాణికుల అవసరం, మరోవైపు అధికారులు అమ్యామ్యాల్లో మునిగి తనిఖీలు లేకపోవడం, రైళ్లలో ఖాళీలు లేకపోవడం ప్రైవేటు బస్సు ఆపరేటర్లకు వరంగా మారుతోంది. విశాఖపట్నంలో ఈ నెల 2న దసరా సందర్భంగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో ఆ జిల్లా రోడ్డు రవాణా అధికారులు విస్తృతంగా సోదాలు చేశారు.అధిక చార్జీలు వసూలు చేయడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి వాటిపై దృష్టి సారించారు. ఏకంగా 40 బస్సులపై కేసులు నమోదు చేశారు. కానీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారులు మాత్రం అసలు ఆ దిశగా కన్నెత్తి చూడలేదు.

విమానధరలు ఇలా...

ప్రస్తుతం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతో పోలిస్తే విమానయాన ధరలే కాస్త అందుబాటులో ఉన్నాయి. బెంగళూరుకు వయా హైదరాబాద్ సింగిల్‌స్టాప్ అయితే సాధారణంగా టిక్కెట్ ధర రూ.13 వేలు ఉంది.. ప్రస్తుతం రూ.20 వేలు ఉంది. డైరెక్ట్ అయితే మామూలు రోజుల్లో రూ.5000 ఇప్పుడైతే రూ. 6,000.. ఆదివారం అయితే రూ.7500ల ఉంటుంది. పండుగ సమయాల్లో ఫ్లైట్ ధరలు ఇష్టానుసారం పెంచ కుండా డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) నిఘా పెట్టింది. ప్రయాణికులకు తగినట్టు విమాన సామర్థ్యాలు పెంచాలని సూచించింది.

రైళ్లు ఫుల్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రవాణా పరంగా గేట్‌వే రాజమండ్రి రైల్వే స్టేషను. బెంగళూరుకు ప్రత్యేక, వారాంతపు రైళ్లతో కలిపి రోజుకు 10 వరకూ రైళ్లు వెళుతుంటాయి. అయితే ఏ రైలులో కూడా టికెట్లు లేవు. హౌరా, హతియా, మాల్దా వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లకు వచ్చే నెలలో కూడా అసలు వెయిటింగ్ లిస్ట్‌లోనూ టికెట్లు లేవు. ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా ప్రయాణికులు రాకపోకలు సాగించే శేషాద్రి, ప్రశాంతిలో వెయిటింగ్ లిస్టు చాంతాడంత ఉంది. హైదరాబాద్ విషయానికి వస్తే రోజూ 16కిపైగా రైళ్లు నడుస్తున్నాయి. వీటిలో ఎక్కువగా సుదూర ప్రాంతాల నుంచి నడిచేవి కావడంతో సాధారణ బోగీల్లో కాలు పెట్టడానికి కూడా వీలు ఉండదు. గౌతమి, గోదావరి, విశాఖ, మహబూబ్‌నగర్ రైళ్లకు వెయిటింగ్ లిస్టు 100దాటి పరుగులు పెడుతోంది. చెన్నైకి ప్రతి రోజూ 10 వరకూ రైళ్లు అందుబాటులో ఉండగా కాకినాడ -పుదుచ్చేరి మినహా మిగతా రైళ్లలో ఖాళీలు లేవు.

- ముగిసిన దసరా పండుగ
- ఇంటి బాట పట్టిన బంధుగణం
- ఆర్టీసీ బస్‌లు.. రైళ్లు ఫుల్..
- ప్రైవేట్ ట్రావెల్స్ ప్రత్యామ్నాయం
- రద్దీ కారణంగా టిక్కెట్ అధనం
- ప్రయాణికుల లబోదిబో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం ప్రసాద్

పొగాకు వద్దు..ప్రత్యామ్నాయం చూడండి

పొగాకు బోర్డు ఆర్ఎం ప్రసాద్

దేవరపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని పొగాకు బోర్డు ఆర్ఎం జీఎల్‌కే. ప్రసాద్ పేర్కొన్నారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో దేవరపల్లి, గోపాలపురం పొగాకు రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల దృష్ట్యా పొగాకు పంట నియంత్రించాల్సి వస్తుందన్నారు. పొగాకు బోర్డు పరిమితి మేరకే పండించాలని రైతులు సూచించారు. కొవ్వూరు వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా పలు అపరాల పంటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవోలు కమలరాజు, ఏసు బాబు, రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, కాట్రు వీరవెంకట సత్యనారాయణ, నరహర శెట్టి రాజేంద్రబాబు,పరిమి శ్రీరామకృష్ణ, కాట్రు భీమరాజు,గద్దే శేషగిరిరావు, సత్తి జగదీశ్వర్ రెడ్డి, హేమస్మిత, రమేశ్ పాల్గొన్నారు.

సారా తయారీ అరికట్టాలి

నవోదయం 2.0 జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సారా తయారీ, విక్రయాలు, రవాణా వంటి వాటిని పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రస్తుత పరిస్థితిని జిల్లా ఎక్సయిజ్ అధికారి సీహెచ్.లావణ్య నివేదించారు. అనంతరం కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ఎక్కడ ఎవరు సారా తయారు చేసినా,అమ్మినా, రవాణా చేసినా 14405కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు.ఈఎస్ లావణ్య మాట్లాడుతూ సారా నిర్మూలనకు జిల్లాలోని 19 మండలాల్లో 19 మండల స్థాయి కమిటీలు, 240 గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేశామన్నారు.ఇప్పటి వరకూ జిల్లాలో 313 అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామని 63 మంది దత్తత అధికారులను నియమించామని తెలిపారు. జిల్లాలో ఆరుగురిపై పీడీ యాక్ట్ పెట్టి ఏడాది పాటు జైలుకు పంపించామన్నారు. జిల్లాలో సారాకు సంబంధించిన 1029 కేసులు నమోదు చేసి 1079 మందిని రిమాండ్‌కు పంపామని తెలిపారు. 13,500 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 3,97,240 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్టు చెప్పారు. 40,324 కేజీల బెల్లం స్వాధీనం చేసుకుని 19 మంది బెల్లం విక్రయదారులపై కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్, అదనపు ఎస్పీ ఏవి సుబ్బరాజు, ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణి సుస్మిత, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్.మూర్తి .డీఎస్‌వో వి.పార్వతి, డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి. శశాంక, ట్రైబల్ ఆఫీసర్ కెఎన్.జ్యోతి ,ఎక్సయిజ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



కోరుకొండ పీహెచ్‌సీ ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న బంధువులు

వైద్యం అందించకుండా చంపేశారు?

కోరుకొండ పీహెచ్‌సీ ఎదుట బంధువుల ఆందోళన

కోరుకొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సకాలంలో వైద్యం చేయకుండా మృతికి కారణమయ్యారంటూ కోరుకొండ పీహెచ్‌సీ ఎదుట పలువురు ఆందోళనకు దిగారు. గత నెల 30వ తేదీ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పాముకాటుకు గురయ్యాడు. ఆసుపత్రికి తీసుకువస్తే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అతనికి పాముకాటు వ్యాక్సిన్ వేయలేదు. దీంతో రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ సోమవారం గాదరాడకు చెందిన కొందరు గ్రామస్తులు కోరుకొండ పీహెచ్‌సీ ముందు ధర్నా చేశారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పీహెచ్‌సీకి వచ్చి వైద్యాధికారులను ప్రశ్నించారు. రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జంబూపట్నం మాజీ సర్పంచ్ నాగా సత్యానారాయణ, ఉల్లి గణ, తోరాట శ్రీను , వైసీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



51 జిల్లా అవార్డులు అందజేసిన కలెక్టర్ కీర్తి చేకూరి చిత్రంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ సోము తదితరులు

స్వచ్ఛ..పండుగ

జిల్లాకు 54 స్వచ్ఛాంధ్ర అవార్డులు



కొవ్వూరు మునిసిపల్ కార్మికుడు శ్యాంబాబుకు అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, చిన్ని చిత్రంలో కలెక్టర్

- 3 రాష్ట్ర అవార్డులు అందించిన సీఎం
- 51 జిల్లా అవార్డులిచ్చిన కలెక్టర్
- ప్రతి పల్లె స్వచ్ఛంగా ఉండాలి
- మార్పు మన నుంచే రావాలి
- కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర 2025 అవార్డుల ప్రధానోత్సవం రాజమహేంద్రవరంలో పండుగలా జరిగింది. శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సోమవారం రాత్రి జిల్లా సాసా నోడల్ అధికారి జేసీ వై.మేఘస్వరూప్ సమన్వయకర్తగా స్వచ్ఛాంధ్ర 2025 అవార్డుల ప్రధానోత్సవం చేశారు. తొలుత కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ స్వచ్ఛత అనేది దేశానికో, రాష్ట్రానికో చేసే సేవగా భావించకుండా మనకు మనం చేసుకునే సేవగా ప్రతి ఒక్కరూ భావించాలని అప్పుడే మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. మార్పు అనేది మన ఇంటి నుంచి.. మన పిల్లల నుంచే ఆరంభం కావాలన్నారు. జిల్లాకు స్వచ్ఛత అవార్డులు రావడం వెనుక పారిశుధ్య కార్మికుల కృషి ఎంతో ఉందని అభినందించారు. జిల్లాకు 3 రాష్ట్ర, 51 జిల్లా స్థాయి అవార్డులు రావడం ఆనందకరమన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ 2017లో ప్రారంభమై పెను మార్పులు తెచ్చిందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ అధికారులు, పారిశుధ్య కార్మికుల కృషి ఫలితంగా అవార్డులు వచ్చాయన్నారు. రాష్ట్రాన్ని హరితాంధ్రగా మార్చాలని ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించుకోవాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు ఉన్నారన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం అవార్డుల ప్రధానం చేశారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ ప్రతి పల్లె స్వచ్ఛంగా తయారుచేయాలన్నారు.

3 రాష్ట్రస్థాయి అవార్డులు

స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల కేటగిరీ కింద రెండు రాష్ట్రస్థాయి అవార్డులను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వరరావు అందుకున్నారు. స్వచ్ఛ బస్‌స్టేషన్‌గా కొవ్వూరు ఎంపికైంది. అవార్డును నాటి డీఎం వైవీవీఎన్ కుమార్‌కు సీఎం చంద్రబాబు అందజేశారు.

51 జిల్లాస్థాయి అవార్డులు..

స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల అవార్డును ఆర్‌డీవో కృష్ణనాయక్, ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయ అవార్డు శ్రీనివాసరావు అందుకున్నారు.

ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ కె.వీరపాండు(వెంకటనగరం),బొంగరాల దుర్గాప్రసాద్ (వేలివెన్ను),పి.రామారావు(నందమూరు), యు.నాగరాజు(ఘంటావారిగూడెం), బత్తిన రాజు (కుతుకులూరు) అవార్డులు అందుకున్నారు.

ఉత్తమ స్వచ్ఛత ఎన్జీవోలు : గుబ్బల రాంబాబు (స్వర్ణాంధ్ర ఫౌండేషన్,రాజమండ్రి), వీవైఎన్‌వీ.సతీష్ , మల్లిడి శ్రీనివాసరెడ్డి (శ్రీరామకృష్ణ సేవా సమితి, అనపర్తి), బీకె హేమ(ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయవిశ్వవిద్యాలయం , రాజమండ్రి)లకు ప్రధానం చేశారు.

ఉత్తమ స్వచ్ఛత యోధులు : ఇంటి పార్వతి, రేలంగి సత్యనాగేశ్వరావు, ముత్యాల పాండు రంగ,యార్లగడ్డ సుబ్బయ్యమ్మ (రాజమండ్రి కార్పొరేషన్), బంగారు సూరిబాబు ,బొట్టు శ్రీహరి, కృష్ణవేణి మామిడిపల్లి, వడ్డాది దుర్గారావు (నిడదవోలు), మీసాల శ్యాంబాబు ,వడ్డాది సత్తిబాబు (కొవ్వూరు)లకు ప్రధానం చేశారు.

స్వచ్ఛ అంగన్‌వాడీలు : సోమన అరుణదేవి (రాజమండ్రి చౌడేశ్వర్‌నగర్),కోరుకొండ అంగన్‌వాడీ అజూబా (కొడమంచిలి),ముక్కామల అంగన్‌వాడీ (పెరవలి) వి.నయనమ్మ, కొవ్వూరు రాజీవ్ కాలనీ అంగన్‌వాడీ చల్లా కనకదుర్గాదేవి, నిడదవోలు తాడిమళ్ల అంగన్‌వాడీ ఎల్లా మోహినీదేవిలకు అవార్డులను ప్రధానం చేశారు.

స్వచ్ఛ పంచాయతీలు : మహబూబ్ ఆలీ(చాగల్లు), బానోతు వెంకటేశ్వర్లు(ఘంటావారిగూడెం), డి.ముత్యం(ఐ.పంగిడి), వడ్డి వీరేంద్ర(కాతేరు), ఎస్ఎస్.ఫణికుమార్(కుతుకులూరు) అవార్డులను అందుకున్నారు.

స్వచ్ఛ ఆసుపత్రులు : పీహెచ్‌సీ డాక్టర్ కె చంద్రబాబు(చాగల్లు), డాక్టర్ ఏహరి శ్రీనివాస్ (ఖండవల్లి), డాక్టర్ దిలీప్ కృష్ణ చైతన్య(రాజమండ్రి మెరకవీధి)లకు అవార్డులు ఇచ్చారు.

స్వచ్ఛ హాస్టల్స్ : ఎస్సీ బాలికల వసతి గృహం కె.నాగభూషణం(సమిశ్రగూడెం), గణేష్ చౌక్ బీసీ హాస్టల్ వాసంశెట్టి సత్యవాణి(రాజమండ్రి), జీఎహెచ్ఎస్ ఎంబి ప్రియదర్శిని (బొమ్మూరు) అవార్డులు అందుకున్నారు.

స్వచ్ఛ పరిశ్రమలు : బలభద్రపురం గ్రాసిం ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎం.జగదీష్ గుప్తా, గుమ్మళ్ల దొడ్డి అస్సాగో ఇండస్ట్రీస్ కె.విశ్వనాథ్ నాయుడు, రాజమండ్రి రూరల్ తేజాస్ స్టీల్ ఇండస్ట్రీస్ సేథి రమేష్ కుమార్,ధవళేశ్వరం హౌస్ ఆఫ్ ట్రైబ్ ప్రైవేట్ లిమిటెడ్ కిషోర్‌లకు అవార్డులిచ్చారు.

స్వచ్ఛ పురపాలక సంఘాలు : నిడదవోలు ఏఎం సత్యనారాయణ, స్వచ్ఛ నివాస వసతి గృహాలు అవార్డులను ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ ధవళేశ్వరం ఏ.వాణి కుమారి అందుకున్నారు. స్వచ్ఛ రైతు బజార్ అవార్డును రాజమండ్రి క్వారీ రైతు బజార్ ఎస్.రోజియా అందుకున్నారు.

స్వచ్ఛ పాఠశాలలు : రఘుదేవపురం పీఎంశ్రీ జడ్పీ స్కూల్ శ్యామలదేవి, నిడదవోలు జెడ్‌పిహెచ్ఎస్ బాలికల పాఠశాల నిట్టల అరుణరాజేశ్వరి ఫిలిప్, అనపర్తి ఎస్ఆర్ జడ్పీహెచ్ఎస్ ప్లస్ పి.వెంకటరెడ్డి, రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీ ఎన్.ప్రశాంతి, కుమారదేవం ఎంపీపీ స్కూల్ పి.చాముండేశ్వరి అందుకున్నారు.

స్వచ్ఛ డ్వాక్రా సంఘాలు : రాజమహేంద్రవరం సీతంపేట మహిళా సహకార సంఘం, కొవ్వూరు రాజీవ్‌కాలనీ మహిళా సంఘం, శ్రీనివాసపురం మహిళా సంఘం అవార్డులను పీడీ టీకనకరాజుకు అందించారు.

స్వచ్ఛ గ్రామాలు : బి.అబ్బులు (చంద్రేడు), బండారు రామకృష్ణ(కానూరు), పెనుమాక రోజ్ మాణిక్యం (కరిచర్లగూడెం), గుమ్మడి సునీత(వెలుగుబంద), కంఠం విజయనిర్మల(వేములూరు) అవార్డులు అందుకున్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

జీఎస్టీ 2.0తో ప్రజలకు ఎంతో మేలు : ఎమ్మెల్యే



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0తో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, ప్రతినెలా ఒక్కో కుటుంబానికి రూ. 1500 వరకూ ఆదా అవుతుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం గజ్జరంలో ఎమ్మెల్యే ముప్పిడి ఆధ్వర్యంలో జీఎస్‌టీ ప్రచారం, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ గురించి వివరించాలన్నారు. అనంతరం గ్రామంలో తగ్గించిన జీఎస్టీ వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం గ్రామంలోని గుత్తుల దుర్గకు రూ. 20 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన సచివాలయ సిబ్బందితో మాట్లా డుతూ వైసీపీ హయాంలో ఏర్పాటైన సచివాలయ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాకర్ల వంశీ, కొరంపాటి దత్తుడు, ఉప సర్పంచ్ దండమూడి శేషగిరిరావు, గన్ని సత్తిబాబు, పూలపల్లి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు

కొవ్వూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకు ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు ఎంఈవో-2 కె.రామకిషోర్ తెలిపారు. సోమవారం ఎంఈవో కార్యాలయంలో ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు యోగా, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, షటిల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు ఎన్టీఆర్ క్రీడాప్రాంగణం, పీఎంఎంఎం మున్సిపల్ హైస్కూల్లో, గవర్నమెంట్ హైస్కూల్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రామాంజనేయులు, గవర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎం బహార్తియా, మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్, వ్యాయామ టీచర్లు ఎస్.నాగరాజు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ టీచర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ చంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచలోహ విగ్రహ సంప్రోక్షణ



రాజ్యలక్ష్మి అమ్మవారి హోమంలో పాల్గొన్న దంపతులు

తాళ్లపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడిలో కొలువై ఉన్న రాజ్యలక్ష్మీ అమ్మవారికి నూతనంగా సమర్పించిన పంచలోహ విగ్రహ సంప్రోక్షణ, కళావాహన కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. శ్రీమాన్ పిద్దింటి శ్యామసుందర శ్రీనివాసాచార్యుల బ్రహ్మత్వంలో శ్రీమాన్ పెదపూడి సాయి సూర్యనారాయణాచార్యుల పర్యవేక్షణలో శ్రీమాన్ పాణింగిపల్లి నిరంజనాచార్యుల ఆచారత్వంలో ఆలయ అర్చకులు గోవర్ధనం చక్రవర్తి ఆధ్వర్యంలో అమ్మవారి పంచలోహ విగ్రహాలకు సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం ప్రధాన కుంభపూజ, హోమాది కార్యక్రమాలు చేశారు. అమ్మవారికి శయ్యదివాసముతో ప్రారంభమయ్యి చతుర్వేద స్వస్తితో కార్యక్రమాలు పూర్తిచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

9న సెపక్‌తక్రా పోటీలు



రామన్నపాలెం హైస్కూల్‌లో పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం జడ్పీ హైస్కూల్‌లో ఈనెల 9న బాలబాలికలకు సెపక్‌తక్రా పోటీలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ఈనెల 11, 12 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో మన జిల్లా తరపున ఆడతారన్నారు.



కొవ్వూరు : స్వచ్ఛ బస్టాండ్ కేటగిరీలో అవార్డు స్వీకరిస్తున్న వైవీఎస్ఎన్ మూర్తి

రాజమండ్రి : స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు స్వీకరిస్తున్న అదనపు కమిషన్ రామలింగేశ్వర్

వడ్లూరులో వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ఉండ్రాజవరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లూరులో సోమవారం వారాహి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు విచ్చేసి ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మధురమే కానీ!



100 సీతాఫలాలు రూ.1600

» మండుతున్న ధరలు
» కొనుగోళ్లకు వెనుకంజ
» సహకరించని వాతావరణం
» ధర ఉన్నా.. దిగుబడి లేదు
» లబోదిబోమంటున్న రైతులు

నల్లజర్ల/దివాన్‌చెరువు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నోరూరించే మధుర ఫలమైన సీతాఫలం ధరలు మండుతున్నాయి. ఈ ఏడాది దిగుబడి తక్కువగా ఉండడంతో మార్కెట్‌లోకి విరివిగా రావడం లేదు. వినియోగదారుల నుంచి డిమాండ్‌కు తగిన సప్లై లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. దూబచర్ల మార్కెట్‌లో 100 సీతాఫలాలు రూ.1600 ధర పలుకుతోంది. నల్లజర్ల మండలం పుల్లలపాడు, ముసుళ్ళకుంట, కొత్తగూడెం, అయ్యవరం, జి.కొత్తపల్లి, రామశింగవరం గ్రామాల నుంచి దూబచర్ల గ్రామానికి, రాజానగరం మండలం శ్రీరాంపురం, శ్రీకృష్ణపట్నం, కానవరం, వెలుగుబంద గ్రామాల నుంచి దివాన్‌చెరువు గ్రామానికి సీతాఫలాలు వస్తుంటాయి. దూర ప్రాంతాలకు వెళ్లే వారు, స్థానికులు ఇక్కడే కొనుగోలు చేసి రవాణా చేస్తారు.

ప్రతికూల వాతావరణం

ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో సీతాఫలాల దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాపు లేదు, కాయరాదు, వచ్చిన కాయలకు మంచి సైజులేదు అంటూ కొంతమంది వాపోతున్నారు. ఈ కారణంగా రైతులకు రావలసిన ఆదాయం తగ్గడంతోబాటు చిరు వ్యాపారులకు సైతం నిరాశే మిగిలింది. పండ్ల దిగుబడి తగ్గడంతో ధరలు ఆకాశానంటుతున్నాయని, దీని వల్ల తాము సీతాఫలాన్ని చూసి ఆనందించడమే తప్ప రుచి చూసే భాగ్యం కలగడం లేదని సామాన్యులు అంటున్నారు. రాజానగరం మండలం దివాన్‌చెరువు, శ్రీరాంపురం, శ్రీకృష్ణపట్నం, కానవరం, వెలుగుబంద గ్రామాల్లో దాదాపు 135 ఎకరాల్లో సీతాఫలాలు విస్తరించి ఉన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వివిధ పండ్ల తోటల్లో చెట్ల మధ్య, గట్లపైన సరిహద్దులలోనూ ఈ సీతాఫలం చెట్లు ఉంటాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి తగ్గి పోయిందని రైతులు చెబుతున్నారు. సాధారణంగా ఆగస్టు నుంచి ప్రారంభమై నవంబరు నెల వరకూ ఈ పండ్ల సీజన్ ఉంటుంది. మే నెలలో కురిసిన వర్షాలు కారణంగా ముందుగానే ప్రారంభమైన సీజన్ మరో వారం, పదిరోజుల్లో ముగిసిపోతుందని కొంతమంది వ్యాపారులు అంటున్నారు. సాధారణంగా రోజుకు రెండుసార్లు కాయలు కోస్తారు. అయితే ప్రస్తుతం కాపు తక్కువగా ఉండడంతో ఒక్కసారే కోస్తున్నామని కొందరు రైతులు వాపోయారు. మే నెలలో తుఫాన్ వల్ల కాయసైజు తగ్గిందని అంటున్నారు. అననుకూల వాతావరణం కారణంగా కాపు తగ్గడానికి తోడు కోతుల బెడద కూడా ఎక్కువగా ఉందని వాటి నుంచి కాయలను కాపాడుకునేందుకు కాపలాదారులను ఏర్పాటు చేసుకోవలసి వస్తోందని శ్రీరాంపురం గ్రామానికి చెందిన వంశీ చెప్పారు. దీనితో అదనంగా ఖర్చులు అవుతున్నాయన్నారు. దివాన్‌చెరువు గ్రామంలో జాతీయ రహదారి వెంట కొంతమంది వ్యాపారులు బుట్టలలో సీతాఫలాలను ఉంచి అమ్మకాలు సాగిస్తారు. ఈ రహదారి మీదుగా ప్రయాణించే దూరప్రాంతాల వారు ఇక్కడ కొనుగోలు చేసుకుని తమ స్వస్థలాలకు తీసుకువెళ్తారు. అలాగే దూరప్రాంతాల్లో ఉండే తమ బంధువులకు కొంతమంది స్థానికులు ఈ పండ్లను ఇక్కడి నుంచి పంపుతూ ఉంటారు. ఇక్కడి సీతాఫలం రుచి చూసిన వారు మరోసారి ఇక్కడి పండ్లనే తినాలని ఎదురు చూస్తుంటారు. కాగా ప్రస్తుతం 100 కాయలు రూ.1500 నుంచి రూ.2500 వరకూ ధర పలుకుతోందని సామాన్యులు వాపోతున్నారు. దీనితో సీతాఫలం రుచి చూడాలని ఆశపడడం తమ వంటి సామాన్య, మధ్యతరగతి వారికి తినడం సాధ్యం కావడం లేదని పలువురు అంటున్నారు.



దూబచర్లలో సీతాఫలాల మార్కెట్

భయపెడుతున్న ధరలు

సీతాఫలాలు ధరలు పెరగడంతో వాటిని కొనుగోలు చేసేందుకు జనం జంకుతున్నారు. ఇక్కడి నుంచి బంధువులకు, స్నేహితులకు కొని పంపించాలని ఉన్నప్పటికీ అధిక ధరలు ఉండడంతో ఇంటి వరకే డజను కాయలతో సరిపెట్టుకుంటున్నారు. మండలంలో సీతాఫలం మార్కెట్ దూబచర్లలోనే ఉంది. హోల్‌సెల్‌గా విక్రయించే దూబచర్లలోనే 100 కాయలు రూ.1600 అంటే జనం హడలిపోతున్నారు.

కొనుగోళ్లు అంతంతమాత్రమే



దూబచర్ల గ్రామానికి చుట్టు పక్కల 16 గ్రామాల నుంచి గతంలో విరివిగా సీతాఫలాలు వచ్చేవి. ప్రస్తుతం పంట విస్తీర్ణం తగ్గింది. దీనికి తోడు ఈ ఏడాది దిగుబడి తక్కువగా ఉంది. పండుగల సీజన్ ప్రారంభం కావడంతో సీతాఫలానికి డిమాండ్ ఎక్కువగా ఉంది. ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరిగాయి. దాంతో కొనుగోలు చేసే వారి సంఖ్య తక్కువగా ఉంది.

-సత్యనారాయణ, వ్యాపారి, దూబచర్ల.

వేగులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



తాళ్లపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అన్నదేవరపేటలో కొలువై ఉన్న వేగులమ్మ వారికి దసరా శరన్నవరాత్రులు పూర్తైన సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాలుగు వేల మంది భక్తులు, కమిటీ సభ్యుడు పప్పొప్పులనాని, తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో బాలదుర్గమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

దేవరపల్లి: దేవరపల్లిలో దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా బాలదుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. యువత పెద్దసంఖ్యలో పాల్గొని బాణసంచా, డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో గరగనృత్యాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: సూర్యారావుపాలెంలో గొంతెలమ్మ వారి విగ్రహాన్ని సోమవారం గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన బ్యాండు మేళాలు, శక్తి వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం బాణసంచా కాల్చారు. ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వ్యాసరచన పోటీలు

దేవరపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జడ్పీ హైస్కూల్‌లో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక శ్రేయస్సు, జాతీయ వృద్ధిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు రామరహిత మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అలాగే పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు ప్రదానం చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చట్ట విరుద్ధ ఉపాధి హామీ పనులపై కలెక్టర్‌కి ఫిర్యాదు



కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తున్న వైస్ ఎంపీపీ నారాయుడు

కొవ్వూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చట్ట విరుద్ధంగా ప్రతిపాదించిన ఉపాధి హామీ పథకం పనులకు పరిపాలనా ఆమోదం రద్దుచేయాలని కోరుతూ మండల వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు కలెక్టర్ కీర్తి చేకూరికి సోమవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ 2024-25లో నియోజకవర్గానికి సంబంధించి రూ. 20 కోట్ల వ్యయంతో 112 పనులకు కలెక్టర్ పరిపాలనా ఆమోదం ఇచ్చారు. అయితే గ్రామసభలలో ఆమోదించిన పనులకు మాత్రమే పరిపాలన ఆమోదం ఇవ్వాలి. ఈ 112 పనులలో అత్యధిక పనులను ఆయా గ్రామ పంచాయతీలు గ్రామ సభలో ప్రతిపాదించి, ఆమోదం తెలపలేదు. గ్రామ, మండల, జిల్లా స్థాయి వార్షిక ప్రణాళికలలో ఆమోదించలేదన్నారు. అలాగే గోపాలపురం నియోజకవర్గం గౌరీపట్నం పంచాయతీ శివారు కొండగూడెంకు చెందిన పుంతరోడ్ ధర్మవరం జడ్పీ రోడ్ నుంచి దేచర్ల పుంతరోడ్‌గా డబ్ల్యు.బి.ఎం రోడ్‌ను మొదలుపెట్టి కొవ్వాడ కాలువ వరకు మొదటి లేయర్ వేశారు. ఈ రోడ్ కొవ్వూరు నియోజకవర్గం పరిధిలోనిది కాదని, ఈ పనికి పరిపాలన ఆమోదం రద్దుచేయాలన్నారు. కొవ్వూరు మండలం పంగిడి పరిధిలో రూ. కోటి రూపాయల ప్రజాధనంతో ప్రైవేటు ఫ్యాక్టరీకి వెళ్లే 800 మీటర్ల పొడవు గల రోడ్‌ను నాలుగు భాగాలుగా విభజించి, రోడ్ వెడల్పును 7.50 మీటర్లుకు పెంచుటకు ఒకే రోడ్డును కుడి, ఎడమ భాగాలుగా విభజించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే రోడ్డు ను మూడు నెలల క్రితం మండల పరిషత్ నిదులు రూ. 10 లక్షలతో నిర్మించారన్నారు. జిల్లా కలెక్టరును, స్థానిక ఎమ్మెల్యేను తప్పుదోవ పట్టించి చట్ట విరుద్ధమైన పనులకు పరిపాలన ఆయోదం రద్దుపరిచి, ఈ పనులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలన్నారు. గ్రామసభలలో ఆమోదించి, వార్షిక ప్రణాళికలో పొందుపరిచిన పనులకు ప్రాధాన్యత క్రమంలో రూ. 20 కోట్లు నిధులను కేటయించాలన్నారు. చట్ట విరుద్ధంగా అక్రమ మార్గంలో పరిపాలనా ఆమోదం కోరిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు : ఆర్డీవో



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందించిన అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు.సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఆరు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పరిష్కార వేదికలు ఏర్పాటుచేసి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. మండల, డివిజనల్ కార్యాలయాలతో పాటు ఆన్‌లైన్‌లో 1100 కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి సమస్యలపై కంప్లైంట్ చేయవచ్చునన్నారు. పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులు పరిష్కరించడంలో అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఒకసారి స్వీకరించిన ఫిర్యాదులు క్షేత్రస్థాయిలో పరిష్కరించి, అదే సమస్యపై ఫిర్యాదులు మరలా రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఊలపల్లిలో గౌరీదేవి ఉత్సవాలు ప్రారంభం

బిక్కవోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊలపల్లిలో రెండేళ్లకొకసారి వెలమల ఆరాధ్యదైవమైన గౌరీదేవి ఉత్సవాలను సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. గ్రామంలోని రెండు వెలమ వర్గాలు ఈ ఉత్సవాలను పోటాపోటీగా జరపుకోవడం ఎన్నో ఏళ్ల నుంచి ఆనవాయితీగా వస్తోంది. గత నెల 23న కొయ్యచెక్కను గ్రామంలోని వడ్రంగికి ఇరు వర్గాల వారు ఇచ్చి గౌరీదేవి విగ్రహాలను తయారు చేయించారు. విగ్రహాలు తయారవ్వడంతో సోమవారం విగ్రహాలను మేళతాళాలు, విచిత్ర వేషధారణలు, బ్యాండు కచేరీలతో వీటిని వెలంపేటలోని రామాలయం, లక్ష్మీగణపతి ఆలయాల్లో వుంచి ప్రక్కన వరిదుబ్బును వుంచారు. ఈనెల 31 వరకూ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుపుతారు. 31న ఉత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తారు. కార్యక్రమంలో అనపర్తి, మండపేట నియోజకవర్గాల వెలమ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు కర్రి శ్రీనివాసరావు, గేదెల వీరబాబు, మాజీ సర్పంచ్ గేదెల సత్యనారాయణ, ఇరు వర్గాల వెలమ పెద్దలు, యువత, తదితరులు పాల్గొన్నారు.

5వ వార్డులోనే సచివాలయాన్ని కొనసాగించాలి

● ఆర్డీవో రాణీసుస్మితకు వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న 5వ వార్డు కౌన్సిలర్ సాయిగీత

కొవ్వూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయాన్ని 5వ వార్డులోనే కొనసాగించాలని కోరుతూ ప్రజలు ఆర్డీవో రాణీసుస్మితకు వినతిపత్రం అందజేశారు. కొవ్వూరు పట్టణంలోని 5వ వార్డులో ఉన్న వార్డు సచివాలయ భవనం మరమ్మతులకు గురికావడంతో వర్షాకాలంలో శ్లాబ్ నుంచి వాటర్‌లీకై కంప్యూటర్లు, స్టేషనరీ, ఫర్నిచర్ పాడైపోతున్నాయని, దీన్ని మార్పు చేయాలని సిబ్బంది ఉన్నతాధికారులకు దరఖాస్తు చేశారు. దీనిపై టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ సిబ్బంది జాయింటు ఇన్‌స్పెక్షన్ నిర్వహించి, భవనం శిథిలావస్థలో ఉందని నివేదిక అందజేశారు. దీంతో 5వ వార్డులోని సచివాలయాన్ని 7వ వార్డులో గల కంటమణి వెంకటేశ్వరరావు భవనంలోకి మార్పు చేస్తూ సెప్టెంబరు 29వ తేదీన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. దీనిపై 5వ వార్డు కౌన్సిలర్ మద్దిపట్ల సాయిగీత 5,6,7 వార్డులకు సంబంధించిన వార్డు సచివాలయాన్ని మార్పు చేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతారని, యథావిధిగా అక్కడే కొనసాగించాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గండ్రోతు శివరామకృష్ణ, దేవగుప్తాపు లక్ష్మణరావు, మద్దిపట్ల దొరబాబు, వార్డులోని మహిళలు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ ... సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు

● ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మేరీ సుజాత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మేరీ సుజాత

నిడదవోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజల కొనుగోలు శక్తి తగ్గినా... జీఎస్టీ ద్వారా మరింత పెరుగుతుందని, నిత్యావసర వస్తువులపై పన్ను మినహాయించడం ప్రజలకెంతో లాభదాయకమని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.మేరీ సుజాత అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అర్థశాస్త్ర అధ్యాపకులు నాని బాబు మాట్లాడుతూ జీఎస్టీ 1.0 మన దేశంలో 2017లో అమలులోనికి వచ్చిందన్నారు. కేంద్ర పన్నులు రాష్ట్ర పన్నులు ఒక చట్రంలోకి రావడం జరిగిందని ఇప్పుడు జీఎస్టీ 2.0 అనేది మరింత సులభతరం చేయడమే కాకుండా ప్రతి వ్యాపారికి ప్రతి వినియోగదారుడికి ప్రయోజనం కలిగేలా చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రాధాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బీ. ఏసురత్నం, అధ్యాపకులు రాజ్‌కుమార్, వెంకటరమణ, బాలకృష్ణ, సూర్యకుమారి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అఖండ గోదావరి మాతకు నీరాజనం



నీరాజనం అందజేస్తున్న పండితులు, మహిళలు

కొవ్వూరు, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి) : అఖండ గౌతమీ గోదావరిమాతకు సోమవారం మహా నీరాజనం సమర్పించారు. గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకుని ప్రదోషకాలంలో గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో వేంచేసియున్న గోవు, గౌతముడు, గోదావరిమాతకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల హారతులతో 241వ మాసోత్సవ మహా నీరాజనం అందజేశారు. కార్యక్రమంలో డీఆర్ఎస్ఎన్ శాస్త్రి, తుట్టగుంట భైరవమూర్తి, దోర్బల ప్రభాకరశర్మ, పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వాహన దొంగలకు రెండు సంవత్సరాల జైలు

గోపాలపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వాహనాల దొంగతనం కేసుకు సంబంధించి ఇద్దరికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ టీ.మనోహర్ సోమవారం తెలిపారు. పీ.శివసుబ్రహ్మణ్యం, మరపట్ల రాజ్‌కుమార్‌పై డీలక్స్ మోటార్ సైకిల్ దొంగతనం కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కోర్టులో వారికి రిమాండ్ విధించారన్నారు. దీనిపై చార్జ్‌షీట్ వేయగా కొవ్వూరు రెండో అదనపు జ్యుడిషియల్ మొదటి తరగతి న్యాయమూర్తి కే.నాగలక్ష్మి ఒక్కొక్కరికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ డీ. బాబూరావు వాదన వినిపించగా, కోర్టు కాని స్టేబుల్ ఎస్.భాను ప్రాసిక్యూషన్‌కు సహకరించినట్టు ఎస్ఐ తెలిపారు.

మోటారు సైకిల్ దొంగతనంపై కేసు

కొవ్వూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు సోమవారం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం మండలంలోని పంగిడికి చెందిన మన్నెల్లి దుగ్గిరాజు 2025 ఆగస్టు 22వ తేదీన ఇంటిముందు బైక్ పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.